

పరిశుభ్రతతో ఆరోగ్యకరమైన సమాజం

సీఎస్ విజయానంద్



విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న సీఎస్ విజయానంద్, కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నంద్యాల జిల్లా కేంద్రంలో పెద్దచెరువు కట్టపై కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సీఎస్ విజయానంద్, జిల్లా స్పెషల్ అధికారి నివాస్, కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, నంద్యాల ఏఎస్పీ మంద జావలి అల్ఫోన్స్ ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీఎస్ విజయానంద్, జిల్లా స్పెషల్ అధికారి నివాస్‌లకు స్థానిక అధికారులు, రాజకీయ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, మెప్మా మహిళలు చేపట్టిన భారీ ర్యాలీని సీఎస్ విజయానంద్ జెండా ఊపి ప్రారంభించారు. పట్టణ శివారులోని పెద్దచెరువు కట్టపై అతిథులు మొక్కలు నాటారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. పరిశుభ్రతకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను వారు ఆవిష్కరించారు. కట్టపై ఉన్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను సీఎస్, జిల్లా స్పెషల్ ఆఫీసర్, కలెక్టర్ తదితరులు ఏరివేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సీఎస్ విజయానంద్ మాట్లాడుతూ చెరువు కట్టను ట్యాంక్‌బండ్ విధానంలో సుందరీకరించేందుకు కలెక్టర్ చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతి నెలా ఓ కార్యక్రమం చొప్పున ఈ నెలలో సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం-పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించడం అనే అంశంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం చేపట్టే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో చల్లా విశ్వనాథ్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్, సీఐలు, టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, టీడీపీ నాయకులు, సచివాలయం, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న సీఎస్ విజయానంద్



ఎగువలో గరుడ వాహనంపై కొలువై మాడవీధుల్లో విహరిస్తున్న జ్వాలా నరసింహస్వామి

ఘనంగా గరుడోత్సవం

- 'ఎగువ'లో ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- దిగువ అహోబిలంలో తీర్థవాది

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతోముఖం.. సకల కార్యకారణ స్వరూపుడై సకల లోకాల్లో, సర్వాత్మల్లో తన తేజస్సును ప్రకాశింపజేస్తూ ఎగువ అహోబిల క్షేత్రంలో అవతరించిన ఉగ్ర నారసింహుడి గరుడ ఉత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవీ, భూదేవీ సమేత జ్వాలా నరసింహస్వామి ఉత్సవమూర్తులను పట్టు పీతాంబరాలు, పూలమాలలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. విశేషాలంకరణ చేసిన గరుడ వాహనంపై జ్వాలా నరసింహస్వామిని కొలువు ఉంచి వైభవంగా గరుడ సేవ నిర్వహించారు. ఎగువలో ఈ రమణీయ వేడుక శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు జరిగింది. బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా ఆలయ అర్చకులు ధ్వజావరోహణం చేపట్టారు. బ్రహ్మోత్సవాలకు రావాలని సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజ స్తంభంపై ఆవిష్కరించిన పటాన్ని శాస్త్రోక్తంగా అవరోహణం చేశారు. దీంతో ఎగువ అహోబిలంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు.



దిగువలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అహోబిల మఠం 46వ పీఠాధిపతి

భక్తిశ్రద్ధలతో ద్వాదశ ఆరాధన : అహోబిలేశుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా దిగువ అహోబిలంలో ఉభయ దేవేరులతో కొలువైన ప్రహ్లాదవరదస్వామికి భక్తిశ్రద్ధలతో ద్వాదశ ఆరాధన నిర్వహించారు. ఆరాధన దోషాలను నివృత్తి చేసుకోవడం కోసం తిరువారాధన చేసి స్వామి, అమ్మవార్లకు అర్చకులు నైవేద్యం సమర్పించారు. అనంతరం ఉభయదేవేరులతో కొలువైన ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులకు కన్నులపండువగా పుష్పయాగం నిర్వహించారు.

'దిగువ'లో తీర్థవాది, చక్రస్నానం

దిగువ అహోబిలంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా అర్చకులు శనివారం ఉదయం శాస్త్రోక్తంగా తీర్థవాది, చక్రస్నానం నిర్వహించారు. ముందుగా శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, నవకలశ తిరుమంజనం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలతో ఉత్సవం నిర్వహించారు. అనంతరం కోనేరులో సుదర్శనమూర్తికి చక్రస్నానం చేయించారు. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్, ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ వేడుకలను పర్యవేక్షించారు.



కట్టలు కట్టలే..!



- సాయంత్రమైతే జేబుల నిండా డబ్బులే
- రిజిస్ట్రేషన్ శాఖలో పెరిగిపోతున్న అవినీతి
- రోజుకు రూ.లక్షల్లో అక్రమ ఆదాయం
- లంచం ఇస్తేనే క్రయ, విక్రయాలు పూర్తి
- నేరుగా పోతే మాత్రం కొర్రీలే..!
- సస్పెండ్ అవుతున్నా కనిపించని మార్పు

జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దోపిడీకి హద్దు లేకుండా పోతోంది. ఆయా కార్యాలయాల వారీగా ఎక్కడికక్కడ దోచేస్తున్నారు. క్రయ విక్రయదారుల నుంచి రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పతున్నారు. కొందరు డాక్యుమెంట్ రైటర్లు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది సైతం తమదైన శైలిలో చేతివాటం ప్రదర్శిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. ఏసీబీ దాడులతోపాటు శాఖ పరమైన చర్యలు తీసుకున్నప్పటికీ సబ్ రిజిస్ట్రార్లలో మాత్రం మార్పు కనిపించడం లేదు. జిల్లాలోని నంద్యాల జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఎక్కడ చూసినా అక్రమ వసూళ్ల దందా కొనసాగుతోందన్న విమర్శలు ఉన్నాయి. మామూళ్లు సమర్పించుకుంటే తప్ప ఫైల్ కదలడం లేదని కొందరు బాధితులు వాపోతున్నారు. ఎంతోకొంత ఇస్తే తప్ప అధికారులు, సిబ్బంది పని చేయడం ఆరోపిస్తున్నారు. కొందరు ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, కొందరు డాక్యుమెంట్ రైటర్లు సిండికేట్‌గా మారి క్రయవిక్రయ దారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడినట్టు తెలిసింది.

నంద్యాల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి):

పది శాతం ఇవ్వాల్సిందే...

జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రధానంగా మూడు రకాలైన క్రయ విక్రయాలు ఎక్కువగా జరుగుతాయి. సేల్ డీడ్, దాన ధర్మం, భాగ పరిష్కార రిజిస్ట్రేషన్‌లు జరుగుతుంటాయి. వీటిలో ఏ పని కావాలన్నా మామూళ్లు చెల్లించాల్సిందే. ఇందుకోసం ప్రత్యేకంగా కార్యాలయ సిబ్బంది, కొంత మంది దస్తావేజు లేఖరులు ప్రత్యేక పర్సంటేజీలు ఖరారు చేశారు. అధికారుల కోసమని సేల్ డీడ్‌కు- 3 నుంచి 5 శాతం, దాన ధర్మం - 1 నుంచి మూడు శాతం, భాగ పరిష్కారం- 2 నుంచి ఐదు శాతం చొప్పున అదనంగా వసూళ్లు చేసి దోపిడీకి గురి చేస్తున్నారని బాధిత వర్గాల నుంచి తెలిసింది. అదేవిధంగా ఏదైనా ప్లాట్, స్థలం కొనుగోలు చేస్తే వాటి విలువను తక్కువగా లెక్కిస్తే ఐదు నుంచి పది శాతం వరకు సమర్పించుకోవాల్సిందే. క్రయ విక్రయదారులు మామూళ్లు ఇవ్వకపోతే నిబంధనల పేరుతో వివిధ రూపాల్లో కొర్రీలు విధించి వెనక్కి పంపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాస్తవంగా ఏదైనా రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే స్టాంపుల రూపంలో (సదరు భూమి, స్థలం మార్కెట్ విలువలో రూ. లక్షకు.. 7.5 శాతం చొప్పున) రూ.7500 చలానా తీయాల్సి ఉంది. అయితే కానీ నిబంధనలు అటు ఇటు ఉండటం, రిజిస్ట్రేషన్ గురించి తెలియని వారు దళారులు, రియల్ ఎస్టేట్ బ్రోకర్ల ద్వారా వస్తే ఈ చలానా ఏకంగా రూ.20 వేల వరకు పెంచి మరీ వసూళ్లు చేస్తున్నారని సమాచారం. వీటికితోడు ఈసీలు, నకల్లు, వివాహ ధ్రువీకరణ పత్రాలు తదితర పత్రాల రూపంలో తమదైన శైలిలో చేతివాటం ప్రదర్శించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మరీ దారుణం. ఎవరైనా రిజిస్ట్రేషన్ సమయంలో ఒప్పందం ప్రకారం అడిగినంతా కాకుండా తక్కువ ఇస్తే మాత్రం అంతే సంగతులు. సదరు క్రయ విక్రయదారులకు సంబంధించి రిజిస్ట్రేషన్ జరిగిన తరువాత డాక్యుమెంట్‌లు కంప్యూటీకరణ చేయకుండా పెండింగ్‌లో పెట్టి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారని బాధిత వర్గాలు ఆరోపిస్తున్నాయి.



నంద్యాలలో రిజిస్ట్రేషన్ల కోసం వేచి ఉన్న వినియోగదారులు

రిజిస్ట్రేషన్ల వారిగా ...

జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రతిరోజూ జరిగే రిజిస్ట్రేషన్లను బట్టి వసూళ్లు చేస్తున్నారు. రోజుకు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో మరింత ఎక్కువగాను.. తక్కువగా జరిగే ప్రాంతాల్లో కొంచెం తక్కువగా అక్కడ పరిస్థితిని బట్టి అక్రమ వసూళ్లకు తెరలేపారు. ప్రధానంగా డాక్యుమెంట్ రైటర్లకు తోడు బయటి వ్యక్తుల ద్వారా దస్తావేజు తయారు చేసేందుకు రూ.4 నుంచి రూ.5 వేలు వరకు వసూలు చేస్తుంటారు. అన్ని సక్రమంగా ఉన్నప్పటికీ అనధికారికంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందికి ఇవ్వాలంటూ అదనంగా రూ.3 నుంచి రూ.5 వేలు వసూళ్లు చేస్తూ రోజుకు రూ.లక్షల్లో అవినీతి సొమ్మును మూట గట్టుకుంటున్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే వీటికి రెట్టింపు స్థాయిలో వసూళ్లు చేస్తున్నారని సమాచారం.

ఫిర్యాదులు మా దృష్టికి రాలేదు..

సబ్ రిజిస్ట్రార్లు, సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు ఎవరైనా అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు మా వద్దకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. క్రయ విక్రయదారులు ఎవరైనా ఇలాంటి సమస్య ఉంటే మా దృష్టికి తీసుకువస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. డాక్యుమెంట్ రైటర్లపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. ఈసీ, నకల్లు, వివాహ ధ్రువీకరణ తదితర పత్రాల కోసం నిబంధనలు ప్రకారం సేవలందించేలా చూస్తాం. ఇకపై ఇలాంటి వాటికి తావులేకుండా ప్రత్యేక దృష్టి పెడుతాం.

- జానకిదేవి, జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ

మచ్చుకు కొన్ని ఉదాహరణలు

- నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని తెలిసింది. ఈసీ, నకల్లు, వివాహ ధ్రువపత్రాల మంజూరులోనూ నిబంధనల కంటే ఎక్కువగా వసూలు చేస్తున్నారని బాధిత వర్గాల ఆరోపణ. కొందరు బయటి వ్యక్తుల ద్వారా ఓ అధికారి సాయంత్రం కాగానే ఆ రోజు జరిగిన రిజిస్ట్రేషన్ల పరంగా లెక్కకట్టి పంపకాలు చేస్తున్నట్లు ఆ శాఖ వర్గాల ద్వారా సమాచారం.

మిగతా 7వ పేజీలో

ప్యాపిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట క్రయ విక్రయదారులు



తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టండి

- మంత్రులు ఫరూక్, బీసీ
- కలెక్టరేట్‌లో తాగునీటి సరఫరాపై సమీక్షా సమావేశం



సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఫరూక్, బీసీ, కలెక్టర్, ఎమ్మెల్యేలు

నంద్యాల నూనెపల్లె, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్టమైన నివారణ చర్యలు చేపట్టాలని మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటి తీవ్రత దృష్ట్యా జిల్లాలోని రూరల్, అర్బన్ ప్రాంతాల్లో సరఫరా చేయాల్సిన తాగునీటి అంశాలపై కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రులు ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారితో పాటు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరయ్యారు. మంత్రులు మాట్లాడుతూ తాగునీటి ఎద్దడిని నివారించేందుకు, నీటి సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు పటిష్ట ప్రణాళికలు రూపొందించి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు.వేసవి కారణంగా భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోతున్న క్రమంలో వచ్చే వర్షాకాలం సీజన్ వరకు ప్రజలు ఇబ్బందిపడకుండా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ 489గ్రామ పంచాయతీల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రజాప్రతినిధును సమన్వయం చేసుకొని ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో దాదాపు 25 అడుగుల లోతులో భూగర్భ జలాలు ఇంకిపోయాయని, నీటి వనరులను అన్వేషించి తాత్కాలిక నీటి సరఫరాపై దృష్టి సారించాలన్నారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ డోన్ ప్రాంతంలో అధిక శాతం వర్షాధారంపైనే ఆధారపడి ఉంటుందని దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్యాపిలి మండలంలో బోర్లు వేశామని, వేసవి దృష్ట్యా మండలాల్లో తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ సుగాలిమెట్ట మోడల్ స్కూల్‌లో తాగునీటి సమస్య అధికంగా ఉందని, వెంటనే సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తొగర్చేడులో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌ను పునరుద్ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, జడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఆర్వో రామునాయక్, అధికారులు పాల్గొన్నారు.

నేడు ఏపీపీఎస్సీ పరీక్ష

నంద్యాల నూనెపల్లె, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు సంబంధించి ఆదివారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల స్క్రీనింగ్ టెస్ట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఆర్వో రామునాయక్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో పరీక్ష నిర్వహణపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రంలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పాణ్యం మండలం నెరవాడ సమీపంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కాలేజీ, నంద్యాల పట్టణంలోని ఎస్బీఐ కాలనీ, శ్రీనివాస సెంటర్‌లలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు ఉదయం 8గంటలకు హాజరు కావాలని సూచించారు. ఉదయం 8 గంటల నుంచి 8.45 గంటల వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని, 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్‌తో 9 వరకు అనుమతిస్తారన్నారు. 9 తర్వాత పరీక్షా కేంద్రంలోకి అనుమతించేది లేదన్నారు. 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు.

ముగిసిన కూచిపూడి నృత్య ప్రదర్శన


కూచిపూడి నృత్య ప్రదర్శన శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

నంద్యాల కల్చరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కూచిపూడి నృత్య ప్రదర్శనలోని 108 కర్ణాలు(భంగిమలు)పై శుక్రవారం నాట్యగురువు పల్లంశెట్టి సురేష్ శిక్షణ నిర్వహించారు. నంద్యాల ఎస్‌బిఐ కాలనీలో నంది ఫైన్ ఆర్ట్స్ ఆర్టిస్ట్ డెవలెప్‌మెంట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ సహకారంతో ఈనెల 7 నుంచి 14 వరకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా నాట్యాచారుడు సురేష్ మాట్లాడుతూ కూచిపూడి ప్రాచీన కాలం నుండి 108 కర్ణాలు అనగా నాట్య భంగిమలు ఆధారంగా ఎన్నో దేవాలయాల్లో అద్భుతంగా శిల్పకళా రూపంలో చిత్రించారని వాటి గురించి నేటి తరానికి అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో శిక్షణా కార్యక్రం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కూచిపూడి నాట్యంలో శిక్షణ కార్యక్రమంలో భాగంగా అహోబిలంలోని దేవాలయంలోని శిల్పాలని పోలుస్తూ నాట్యగురువులు సురేష్, మౌనికలు 108 కర్ణాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

జలం లేని జీవం

జలమే జీవనాధారమైతే
మరి మా జీవితాలు
ఎలా సాగుతున్నాయి...?
వర్షం మొహం చాటేటి
దిశ మార్చుకొని పోతుంది

నాయకులూ అంతే...
ఉపన్యాసాల ధారలు
కురిపించి తడిపేస్తారు...
ఐనా తడిలేని వారి మాటల్లో
తేమలేని మా బతుకులు
ఎప్పటికి తెల్లవారేను...??

నదులనానుకొని సంస్కృతి
పుడమిలో ప్రభవిస్తుందంటారే
మరి ఏమి చూసుకొని
మా జీవితాలు వికసిస్తాయి..?
అవెప్పుడు తిరిగి
పరిమళిస్తాయి..?
నెర్రెలు మోడుతున్న నేలలు
పచ్చదనాన్ని మరచిన
రైతన్నల నేత్రాలు
రంగుల కలలు ఎలా
కంటాయి..?

ఎండిన జీవితాలు
పచ్చగా మారేదెప్పుడో
మరి
కరువు మా
ముఖచిత్రంగా
వలసలే మా గమనంగా
అగమ్యగోచరమైన
భవిషత్తు
తరువతి తరానికి
కానుకగా ఇవ్వవలసిందేనా...?
కనుచూపు మేర కనబడని
ఏ కారుమేఘమొచ్చి
తీరుస్తుంది
మా బతుకుల
వెతలు...??


- జంధ్యాల రఘుబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సాహితీ స్రవంతి.

కళ

కర్నూలు ఉస్తాద్..



కర్నూలు పాత బస్తీలో పుట్టి పెరిగి జాతీయ స్థాయిలో హిందుస్థానీ స్వర విహారం చేసిన విఖ్యాత ఖవ్వాలీ గాయకుడు ఉస్తాద్ న్యామతుల్లా తెలుగువారికి గర్వకారణం. ఆయన ఖవ్వాలీ సంగీత సంప్రదాయంలో పుట్టిపెరిగారు. ఆయన తండ్రి సుప్రసిద్ధ హిందుస్థానీ సంగీత విద్వాంసుడు ఉస్తాద్ మహ్మద్ జాఫర్ పేరు విననివారు ఉండరు. ఖవ్వాలీకి ఆయన శాశ్వత చిరునామా. ఆయన ప్రభావంలో, శిక్షణలో న్యామతుల్లా ఖవ్వాలీ పాటల బాటసారిగా ఎదిగారు. ఆయన సంగీతానికి గుర్తింపుగా న్యామతుల్లా పేరుకు ముందు ఉస్తాద్ అనే పదం వచ్చి చేరింది. తన 78 ఏళ్ల ప్రాయంలోనూ ఆయన చాలా ఉత్సాహంగా ఉన్నారు.

కర్నూలు కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఖవ్వాలీ పాటలు పాడుతూ దేశవ్యాప్తంగా అనేక చోట్ల ప్రదర్శనలు ఇచ్చి ప్రత్యేక గుర్తింపు తెచ్చు కున్న న్యామతుల్లా యువకునిగా ఉన్నప్పుడే హిందు స్థానీ సంగీతంలో నిష్ణాతుడై, తబలా వాయిద్యంపై ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ వంటి వారి నుంచి ప్రశంసలు అందుకు న్నారు. ఇటీవల సంగీత శబ్ద మాంత్రికుడు ఏఆర్ రహమాన్ ముందు కూడా తన తబలా పాండిత్యాన్ని అనేక సార్లు ప్రదర్శించి భేష్ అనిపించుకున్నారు. ఇక దోగాడే ప్రాయం నుంచే తండ్రి ఉస్తాద్ మహ్మద్ జాఫర్ ఒడిలో కూర్చొని ఖవ్వాలీ పాటలను ఆస్వాదించారు. పన్నెండేళ్ల ప్రాయంలో చేసిన తొలి కచేరీ ఆయన జీవితాన్ని పూర్తిగా మలుపు తిప్పేసింది. ఎంతలా అంటే జాతీయ స్థాయిలో నూ అనేక మంది ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకునేలా నిలబెట్టింది. ఆయన పేరుకు ముందు 'ఉస్తాద్' అనే బిరుదును కూడా అలంకరింపజేసింది. హైస్కూల్ విద్య వరకే చదువుకు న్నా ఆయన సంగీతానికి ఆసక్తి, అభిరుచి ఒక్కటే ముఖ్యమని నిరూపించారు. స్వరాలకు కులమత భేదాలు లేవంటూ దేశవ్యాప్తంగా 3వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ఇప్పటికీ ఇస్తున్నారు.

- హిందుస్థానీ సంగీతంలో ఉస్తాద్ న్యామతుల్లా
- ఖవ్వాలీ పాటలే ఆయనకు జీవితం
- తబలిస్టు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ నుంచి ప్రశంసలు
- ఏఆర్ రహమాన్ ముందు అనేక సార్లు ప్రదర్శనలు
- జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన వైనం

బాల్యం...కుటుంబ నేపథ్యం...

కర్నూలు ఖడక్‌పురకు చెందిన ఉస్తాద్ చూరన్ ఖవ్వాలీ అంటే 1940 దశకంలో పెట్టింది పేరు. ఆయన సూఫీ సాహిత్యాన్ని మేళవించిన ఖవ్వాలీ గీతాలతో దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందారు. ఆయనకు రెండో సంతానంగా 1947 ఏప్రిల్ ఒకటిన న్యామతుల్లా జన్మించారు. ఆయన సంతానంలో చివరి వాడైన న్యామతుల్లా పుట్టిన ఏడాదికే తల్లి జహరా బీ కన్నుమూసింది. అయితే తండ్రి మళ్లీ పెళ్లి చేసుకోకుండా ముగ్గురు పిల్లలను తానే చూసుకునేవారు. అలా ఆయన వెంట పిల్లలు కూడా కచేరీలకు వెళ్లేవారు. తండ్రి ఒడిలో కూర్చొబెట్టుకుని కచేరీ చేస్తుంటే పసి బాలుడు ఆసక్తిగా వింటూ ఉండేవారు. తన పన్నెండో ఏట తండ్రి ప్రోత్సాహంతో లావుబాలీ దర్గాలో తొలి ప్రదర్శన ఇచ్చాడు. అప్పుడు ఆయనపై ప్రశంసల జల్లు కురిసింది. తర్వాత వెనక్కు తిరిగి చూసుకోలేదు. మరోవైపు మున్సిపల్ హైస్కూల్‌లో ఎస్ఎస్ఎల్‌సీ పూర్తి చేశారు. స్థానికంగా మౌలా మిస్కెన్, గోల్ గుమ్మజ్, ఉస్మానియా కళాశాల మైదానంలో కచేరీలు చేశారు.



టీజీవీ కళాక్షేత్రంలో సత్కారం అందుకుంటున్న న్యామతుల్లా

మలుపు తిప్పిన ఉద్యోగ జీవితం...

పాతనగరంలోని మాసుంబాషా దర్గాలో గాలిబ్ గజల్స్ పాడుతుండగా ఆ కార్యక్రమానికి యాదృశ్చికంగా విచ్చేసిన నాటి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) ఏజీఎం చల్లాదురై హాజరయ్యారు. ఆ కచేరీ పూర్తయ్యాక సంగీత ప్రియుడైన ఆయన న్యామతుల్లాకు కబురు చేసి, తన వద్దే సెక్యూరిటీ ఇన్‌ఛార్జి ఉద్యోగం ఇప్పించారు. అలా ఆయన కూడా న్యామతుల్లా పాటలు వింటూ గడిపేవాడు. అక్కడే పనిచేస్తున్న హనుమంతరావు అనే హిందూస్థానీ సంగీత విద్వాంసునితో న్యామతుల్లాకు పరిచయం పెరిగింది. దీంతో ఆయన హిందూస్థానీ సంగీతాన్ని న్యామతుల్లాకు బోధించడంతోపాటు, తబలా వాయిద్యంలో ఉస్తాద్ (మాస్టర్)గా మార్చేశారు. అలా ఇరువురూ ఎఫ్‌సీఐ దేశవ్యాప్తంగా నిర్వహించే అనేక సాంస్కృతిక ప్రదర్శనలకు వెళ్లి బహుమతులు తెచ్చి నాటి ఎఫ్‌సీఐ జిల్లా శాఖ ఖ్యాతిని నేల నాలుగు చెరగులా చాటి చెప్పారు.

భావి తరాలకు శిక్షణ అందించాలని ఉంది



మారుతున్న కాలంలో ఖవ్వాలీ పాటలు యువతరానికి దూరమౌతున్నాయి. మరో ఇరవై ఏళ్లు పోతే ఈ ఖవ్వాలీ ప్రక్రియ కూడా పూర్తిగా తెరచాటుకు వెళ్లిపోయే ప్రమాదం ఉంది. అందుకే ప్రభుత్వం కానీ, స్వచ్ఛంద సంస్థలు కానీ అవకాశం కల్పిస్తే పది మందికి నేర్పించాలని ఉంది. ఖవ్వాలీ గొప్ప కళాప్రక్రియ. ఇది ఆధ్యాత్మిక భావాలతోపాటూ మనిషికి ప్రశాంతతను ఇచ్చే గొప్ప సంగీత, గాత్ర లయ విన్యాసం. ఉత్తరాది రాష్ట్రాల్లో అక్కడక్కడా ప్రోత్సాహం ఉంది. దక్షిణాదిలోనూ ఈ కళను పదికాలాలు బతికించాలని కోరుకుంటున్నా.
- ఉస్తాద్ న్యామతుల్లా


దేశ వ్యాప్తంగా మూడు వేలకు పైగా కచేరీలు...

ఒకవైపు ఉద్యోగం కొనసాగిస్తూనే న్యామతుల్లా దేశవ్యాప్తంగా హిందూస్థానీ సంగీత కచేరీలు చేసేవారు. అలాగే తన ఖవ్వాలీ బృందంతో కలిసి సుమారు మూడు వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ఢిల్లీలో తబలా విద్వాంసుడు, దివంగత ఉస్తాద్ జాకీర్ హుసేన్ ముందు తన తబలా ప్రదర్శన చేసి ఆయన ప్రశంస లు అందుకున్నారు. అలాగే ప్రస్తుత సంగీత ప్రపంచంలో రారాజుగా ఖ్యాతి గాంచిన ఏఆర్ రహమాన్ ముందు కూడా అనేక హిందుస్థానీ రాగాల కు తబలా వాయిద్యం ద్వారా ప్రదర్శనలు ఇచ్చి ఆయనకు సన్నిహితుడుగా పేరు తెచ్చుకున్నారు. అలాగే 1980 వరకు ఆకాశవాణిలో ప్రదర్శనలు ఇచ్చారు. అలాగే కేరళ, చెన్నై, బెంగుళూరు, ముంబాయి తదితర ప్రాంతాల్లో జరిగిన ఆంధ్ర మహాసభల్లోనూ తన కచేరీలతో ప్రశంసలు అందుకున్నారు. న్యామతుల్లా ప్రతిభకు పురస్కారాలు ఎన్నో లభించాయి. అనేక చోట బంగారు, వెండి మెడల్స్‌తోపాటు అనేక పురస్కారాలు అందుకున్నారు. వివిధ కళా సంస్థలు ఆయనకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులతో ఘనంగా సత్కరించాయి.

తుంగభద్ర సాహిత్యం



సీమ ప్రజల సామాజిక జీవనమే సీమ రేగడి కథలు



కర్నూలు కల్చరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాయలసీమ ప్రాంతానికి ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. యాస, భాష, జీవన విధానాలన్నీ ఇతర ప్రాంతాలతో పోలిస్తే భిన్నంగా కనిపిస్తాయి. తరతరాల ఆచారాలు, సాంస్కృతిక వ్యవహారాలు ఇతరులకు భిన్నంగా కనిపించినా ఇది ఈ ప్రాంత జనజీవనంలో ఒక భాగమైపోయింది. ఈ నేపథ్యాన్ని తీసుకొనే కర్నూలుకు చెందిన ప్రముఖ రచయిత, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి కథలు రాస్తున్నారు. అలా ఆయన రాసిన కథల్లో ఆణిముత్యాల్లాంటి తొమ్మిది కథలను 'సీమ రేగడి కథలు' పేరుతో పుస్తకాన్ని ముద్రించారు. రాయలసీమలో పూర్వపు రోజుల్లో ప్రబలే అంటు వ్యాధుల నివారణకు ఊళ్లకు ఊళ్లే స్వీయ నిర్బంధం (కరోనా సమయంలో లాక్‌డౌన్‌లా) ప్రకటించుకునేవి. అంతేకాదు, ఆ నిర్బంధాన్ని పక్కాగా పాటిస్తూ ఆ విపత్తులను సమష్టిగా ఎదుర్కొనేవారు. ఆనాటి ఆ పరిస్థితిని కళ్లకు కట్టినట్లు 'పొత్తి' కథ ద్వారా చూపించారు. నేటి ఆధునిక కాలంలో కరోనా సమయంలో పాటించిన లాక్‌డౌన్ వంటి కార్యక్రమాలను వందల ఏళ్లనాడు సీమ ప్రజలు పెద్ద చదువులు లేకుండా కఠినంగా అమలు పరిచి తమను తాము కాపాడుకునే సామాజిక అంశాన్ని రచయిత సునిశితంగా తెలియజేశారు. అలాగే ఆరోజుల్లో మెలకసీమ పల్లెల్లో టిఫినుకు పావు విస్తరి, నడిగడ్డ పల్లెల్లో సగం విస్తరి, రాయలసీమ పల్లెల్లో పూర్తి విస్తరి వేస్తారని చెబుతూ 'పెండ్లి' కథలో తెలియజేస్తారు. వయసుకు వచ్చిన కూతురు తన పనివాడితో చనువుగా ఉండటాన్ని చూసిన తండ్రి తప్పుడు కేసు పెట్టి పగతీర్చుకోవడం సాధారణ కథలాగే అనిపించినా ఈ కథను నడిపించే విధానంలో ఆద్యంతం ఆసక్తికరంగా 'ఓ పనోడి కథ'ను రచయిత రాశారు. కన్న ఊరు చింతలను తీర్చడానికి ప్రాణాన్ని పణంగా పెట్టిన ఓ యువకుని సాహసగాథగా 'పొలిముద్ద కథ' నిలుస్తుంది. పండిన పంటను ఇంటికి చేర్చే క్రమంలో రైతుల కడగండ్లను, కష్టాలను పడరాని పాట్లను 'ఆరుతడి' కథలో కానవస్తుంది. దక్కే కాస్త సుఖం కోసం కొండంత బాధను అనుభవించాల్సి ఉంటుదని, తప్పుడు మార్గాల్లో లభించే సుఖం ఎన్నటికైనా ప్రాణంపైకి తెస్తుందని 'సౌఖ్యం' కథ తెలియజేస్తుంది. పెద్దరికం పేరుతో ఒంటరి అయిన ఓ తండ్రి, తిరిగి మారిపోయి తన కూతురి ప్రేమను అంగీకరించి తిరిగి సంతోషాన్ని ఇంటికి తెచ్చుకున్న వైనం 'సీమ సూర్యుడు' కథలో చూస్తాం. మాటల గారడీతో సమాజంలోని అమాయకులను మోసం చేసే వారు ఎందరో, అలాంటి వారి కథే 'వృద్ధ జంబూకం'. సీమ రేగడి కథలు పుస్తకంలో కథలన్నీ ఆద్యంతం హృద్యంగా సాగుతూ ఏకబిగిన చదివిస్తాయి. కల్పనకు తావు ఇవ్వకుండా వాస్తవ అంశాలను జోడిస్తూ అద్భుతమైన కథలను రచయిత పాఠకులకు అందించారు. ఈ కథలు చదవితే గతకాలపు ఈ ప్రాంత స్థితిగతులు, ఒకనాటి ఉమ్మడి రాష్ట్రంలో తుంగభద్ర నదికి ఆవల ఉన్న తెలంగాణ ప్రాంత రైతుల జీవన స్థితిగతులు, అక్కడక్కడా సీమ, తెలంగాణా ప్రాంత మాండలిక పద ప్రయోగాలు, సామెతలను రచయిత తన కథల్లో చొప్పి ఆ కథలకు మరింత సొబగులు దిద్దారు. ఈ పుస్తకం అన్ని పుస్తక విక్రయశాలల్లో లభిస్తుంది.


- బి. రాణీ లీలావతి, నగర అధ్యక్షురాలు, అరసం, కర్నూలు



కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

నేడు సముద్ర శాస్త్రవేత్త ఎంపీఎం రెడ్డి సంస్మరణ సభ



కర్నూలు కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన సుప్రసిద్ధ సముద్ర శాస్త్రవేత్త డాక్టర్ ఎంపీఎం రెడ్డి సంస్మరణ సభ ఆదివారం ఉదయం 10:30 గంటలకు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసినట్లు తెలుగు కళా సమితి అధ్యక్షుడు ఎస్ఎండీ ఇనాయతుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు బనగానపల్లె అరుణ భారతి సంస్థ అధ్యక్షులు బీసీ రాజారెడ్డి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు విద్వాన్ పత్తి ఓబులయ్య, డాక్టర్ ఎం.మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. తెలుగు కళా స్రవంతి ఆధ్వర్యంలో జరిగే ఈ సంస్మరణ సభకు సాహితీ మిత్రులందరూ పాల్గొని డాక్టర్ ఎంపీఎం రెడ్డికి నివాళులు అర్పించాలని ఇనాయతుల్లా విజ్ఞప్తి చేశారు.

భారీ ధర పలికిన పొట్టేళ్లు

అన్న రూ.80 వేలు, తమ్ముడు రూ.90 వేలకు కొనుగోలు


రూ.90 ,రూ.80 వేలకు కొన్న పొట్టేళ్లను చూపుతున్న గోవిందు



దేవనకొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఓ రెండు పొట్టేళ్లు భారీ ధర పలికాయి. ఒకటి రూ.90 వేలు తీసుకోగా మరొకటి రూ.80 వేలు పలికాయి. గద్దెరాళ్ల దేవర కోసం పల్లెదొడ్డికి చెందిన హనుమంతు, రామాంజిని అన్నదమ్ముల కుమారులు గోవిందు తెలంగాణలోని ఐజ సంతలో రూ.90 వేలకు ఓ పొట్టేలు కొన్నాడు. అన్న కౌలుట్ల కర్ణాటకలోని బళ్లారి సంతకు వెళ్లి రూ.80 వేలకు పొట్టేలు కొన్నాడు.


కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు




పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు


శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు


గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి


చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు


వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు


సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు

కట్టలు కట్టలే..!

(5వ పేజీ తరువాయి)

- జూపాడుబంగ్లా మండలానికి చెందిన ఓ వ్యక్తి రిజిస్ట్రేషన్ కోసం గత వారంలో నందికొట్కూరు కార్యాలయానికి వెళ్లారు. వెంటనే స్టాంప్ చలానా రూ.60 వేలు తీయమన్నారు. ఆ తర్వాత అదనంగా ఓ రైటర్ రూ.20 వేలు తీసుకున్నారు. ఇలా నిత్యం అక్కడ సిబ్బంది.. కొందరు రైటర్లు కుమ్మక్కై అధిక వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిసింది. కింది స్థాయి సిబ్బందిలో ఒకరు సాయంత్రం కాగానే వసూళ్లు చేసుకొచ్చి అందజేస్తున్నట్లు తెలిసింది.
- బనగానపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ముడుపులు ఇస్తే తప్ప పనులు జరగడం లేదని తెలుస్తోంది. ఎవరైనా నేరుగా వెళ్తే వివిధ రూపాల్లో కొర్రీలు విధిస్తున్నారని సమాచారం. ముడుపులు చెల్లిస్తే ఆ తర్వాత సాఫీగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని బాధిత వర్గాల ఆవేదన. ఒక్కొక్క రిజిస్ట్రేషన్‌కు రూ.3 నుంచి రూ.5 వేలు బయటి వ్యక్తులను ఏర్పాటు చేసుకుని వసూలు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఇదే కార్యాలయంలో పని చేసిన ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు సస్పెండైనా అవినీతి అక్రమాలు మాత్రం ఆగడం లేదు.
- అవుకు, కోవెలకుంట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో రిజిస్ట్రేషన్లు ఆశాజనకంగానే సాగుతున్నాయి. అవుకులో అయితే డాక్యుమెంట్ రైటర్లు రెండు వర్గాలుగా విడిపోయి సాయంత్రం కాగానే జరిగిన వసూలు చేసిన మామూళ్లను సంబంధిత అధికారికి ముట్టచెప్పుతారని సమాచారం. గతంలో ఇక్కడ ఓ జూనియర్ అసిస్టెంట్ ఏసీబీ వలకు చిక్కారు.
- డోన్ సబ్ రిజిస్ట్రార్ తీరుపై పలు రకాల అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఏ పని కోసం వచ్చినా పైసలు ఇవ్వందే పని చేయరనే విమర్శలు ఉన్నాయి. ఇక్కడ 15 మంది డాక్యుమెంట్ రైటర్లు ఉండగా వీరిలో ఒక డాక్యుమెంట్ రైటర్ ద్వారా సదరు సబ్ రిజిస్ట్రార్ లోగుట్టు వ్యవహారం నడిపిస్తున్నారని తెలిసింది. రోజువారిగా జరిగిన రిజిస్ట్రేషన్ల పరంగా సదరు డాక్యుమెంట్ రైటర్ మిగిలిన వాళ్లతో వసూలు చేసుకొని వచ్చి సదరు అధికారికి అందజేసే విధంగా వ్యవహారం సాగుతోందని ఆరోపణలున్నాయి.
- ప్యాపిలిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ఇద్దరు డాక్యుమెంట్ రైటర్లు ఉన్నారు. సదరు కార్యాలయంలో ఏ పని కావాలన్నా సదరు డాక్యుమెంట్ రైటర్లను కలిస్తేనే పని జరుగుతుందనే ప్రచారం లేకపోలేదు. అక్కడ ఉద్యోగుల నోటి నుంచి కూడా ఇదే పదం రావడం గమనార్హం. ఆ ఇద్దరు డాక్యుమెంట్ రైటర్లు ఏ రోజుకారోజు జరిగిన క్రయ విక్రయాల పరంగా వచ్చిన మొత్తాన్ని ఇంటికి వెళ్లే సమయంలో ఓ అధికారికి అందజేస్తున్నారని సమాచారం.
- ఆళ్లగడ్డ, బండిఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొందరు బయటి వ్యక్తులు సభ్యులుగా ఏర్పడి రిజిస్ట్రేషన్లలో అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. కొందరు బయటి వ్యక్తులతో పాటు ఒకరిద్దరు డాక్యుమెంట్ రైటర్లు క్రయ,విక్రయదారులతో ముందుగానే డబ్బు వసూలు చేసి కార్యాలయ పనివేళలు ముగియగానే పంపకాలు చేస్తున్నట్లు పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. ఎవరైనా అడిగినంత ఇవ్వకపోతే వారి డాక్యుమెంట్లు ముందుకు కదలవు. రిజిస్ట్రేషన్లు సైతం ఆలస్యంగా జరుగుతాయన్న ఆరోపణలున్నాయి.

భార్యను హత్య చేసిన భర్త

నందికొట్కూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): భర్త చేతిలో భార్య హత్యకు గురైన ఘటన నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డి శేషశయనారెడ్డి నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. మొల్ల అబ్దుల్లా(26), నజీమూన్(21) కొంత కాలంగా పట్టణంలో జీవిస్తున్నారు. బండి ఆత్మకూరుకు చెందిన పటాన్ అలీబాషా కుమార్తె నజీమూన్‌కు గడివేముల మండలం మంచాలకట్ట గ్రామానికి చెందిన మొల్ల అబ్దుల్లాతో రెండున్నరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి 14 నెలల కూతురు ఉంది. మొల్ల అబ్దుల్లా తాపీమేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. నజీమూన్ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడటాన్ని అబ్దుల్లా తల్లి రఫియాబీ అనుమానం కలిగే విధంగా మాటలు చెప్పి తరచూ నజీమూన్‌ను కొట్టించేది. శుక్రవారం సాయంత్రం ఆమె ఫోన్‌లో మాట్లాడుతుండడంతో ఇద్దరు భార్యాభర్తలు గొడవ పడ్డారు. అబ్దుల్లా ఆమెను కర్రతో చితకబాదడంతో కిందపడిపోయింది. తలకు బలమైన గాయం కావడంతో తీవ్రగాయాల పాలవగా నందికొట్కూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో డాక్టర్లు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులకు అబ్దుల్లా సమాచారం ఇచ్చాడు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ పరిశీలించారు. నాజీమూన్ తండ్రి పటాన్ అలీబాషా ఫిర్యాదు మేరకు మొల్ల అబ్దుల్లా, అతడి తల్లి మొల్ల రఫియాబీలపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.



కుటుంబ సభ్యులతో నజీమూన్ (ఫైల్)

దాడి కేసులో నిందితుల అరెస్టు



నిందితులను చూపుతున్న డీఎస్పీ, సీఐ, పోలీసులు

కోవెలకుంట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కంపమల్ల గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు సోమల లోకేశ్వర్‌రెడ్డిపై జరిగిన దాడి కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ కె.ప్రమోద్ తెలిపారు. శనివారం కోవెలకుంట్ల సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రమోద్ మాట్లాడుతూ వైసీపీకి చెందిన సోమల లోకేశ్వర్‌రెడ్డి, టీడీపీకి చెందిన సూర చిన్నసుబ్బారెడ్డిలపై కేసు నమోదు చేశామన్నారు. 2019 నుంచి 2024 వరకు రెండున్నర సంవత్సరాలు లోకేశ్‌రెడ్డి సర్పంచ్‌గా పని చేశాడని తెలిపారు. ఇటీవల టీడీపీకి చెందిన చిన్నసుబ్బారెడ్డి వర్గీయులను రెచ్చగొట్టే విధంగా లోకేశ్‌రెడ్డి అనుచరులు మాట్లాడారని, దీంతో సుబ్బారెడ్డి వర్గీయులు ఇనుపరాడ్లను తీసుకుని సోమల లోకేశ్ ఇంటిపై దాడి చేశారని అన్నారు. ముందుగా వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డిని కొట్టి గాయపరిచారని తెలిపారు. తరువాత వెంకటేశ్వర్‌రెడ్డి ఇంట్లో ఉండగా ఇంట్లో రెండు డోర్లను పగలగొట్టి వెంకటేశ్వర్లుపై దాడి చేసి గాయపరిచారని, అంతలో లోకేశ్‌రెడ్డి పొలం నుంచి ఇంటికి రాగా అతనిపైనా దాడి చేసి గాయపర్చారని అన్నారు. లోకేశ్‌రెడ్డి స్పృహ తప్పగా అతని తమ్ముడు వెంకటేశ్వర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొమ్మిది మందిపై కేసు నమోదు చేశామని చెప్పారు. అందులో సూరచిన్నసుబ్బారెడ్డి, సోమల లక్ష్మీనారాయణరెడ్డి, సూర సురేష్ కుమార్‌రెడ్డి, సూర రవికుమార్‌రెడ్డి, షేక్ సుభాన్, రావిడ్డిగారి వెంకటసుబ్బారెడ్డిలను శనివారం ఆళ్లగడ్డ రోడ్డులోని కంపమల్ల మెట్ట వద్ద కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారని తెలిపారు. వారి వద్ద నుంచి ఇనుపరాడ్లను స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని చెప్పారు. త్వరలోనే వారిని కూడా అరెస్టు చేసి రిమాండుకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల సీఐ హనుమంతనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

కాపు కాసి.. కారం కొట్టి..

- వేటకొడవళ్లతో నరికి అతి దారుణంగా హత్య
- కాపాడబోయిన ఓ మహిళపైనా దాడి
- సంజన్న మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి
- అంజి వర్గీయుల కోసం పోలీసుల గాలింపు
- బాధిత కుటుంబానికి ఎంపీ శబరి, గౌరు వెంకటరెడ్డి పరామర్శ



మృతుడు సంజన్న (ఫైల్)

కర్నూలు క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శరీన్‌నగర్‌లో జరిగిన టీడీపీ నాయకుడు సంజన్న హత్య కేసులో పలు కోణాలు వెలుగులోకి వచ్చాయి. శుక్రవారం రాత్రి 9:30 గంటల ప్రాంతంలో జరిగిన ఈ హత్యపై పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు. శనివారం మార్చురీ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సంజన్న మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తుండటంతో సంజన్న వర్గీయులు పెద్దఎత్తున మార్చురీ వద్దకు చేరుకున్నారు. అంజి వర్గీయులను వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు 24 గంటల్లో అరెస్టు చేస్తామని చెప్పడంతో వివాదం సద్దుమని గింది. అనంతరం సంజన్న మృతదేహానికి ఆసుపత్రి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించారు.

కాపాడబోయిన ఓ మహిళ

సంజన్నకు సుపరిచితురాలైన ఫాతిమాబేగం అనే మహిళ ఆ సమయంలో అక్కడే ఉంది. ఈమె కూడా సంజన్నతో పాటు కరాటేలో శిక్షణ తీసుకున్నారు. ముందుగానే గుంపులు గుంపులుగా ఉన్న వారిని గుర్తించిన ఆమె సంజన్నను అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ కోరారు. అయితే సంజన్న పెద్దగా పట్టించుకోలేదు. సంజన్నపై అంజి వర్గీయులు దాడి చేయగానే ఈమె అడ్డుపడింది. సంజన్న కింద పడిపోగానే మీద అడ్డంగా పడి కాపాడబోయే ప్రయత్నం చేసింది. దీంతో అంజి వర్గీయులు ఆమెపై కూడా దాడి చేశారు. చేతిలో ఉన్న కర్రలతో ఆమెను తీవ్రంగా కొట్టారు. ఓ నిందితుడు ఆమెపై కత్తితో దాడి చేయబోగా కాలితో తన్నడంతో కత్తి కాలికి గుచ్చుకొని గాయమైంది. సంజన్నను కాపాడేందుకు ఆమె తీవ్రంగానే ప్రతిఘటించినట్లుగా తెలుస్తోంది. ఈ సన్నివేశాన్ని కరీం బాషా అనే వ్యక్తి సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా అంజి వర్గీయులు ఆ సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు. ఇంతలో సంజన్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అంజి వర్గీయులు సంజన్న కొడుకులపై కూడా కత్తితో దాడి చేయబోయారు. ఆయన భార్య లక్ష్మీదేవిని పక్కకు తోసేశారు. సంజన్న చనిపోయాడని తెలుసుకుని అక్కడి నుంచి కార్లలో పరారయ్యారు. స్థానిక హ్యాంగవుట్ హోటల్ వద్ద అంజి వర్గీయులు ఉపయోగించిన కారును గుర్తించారు. కారులో సమస్య రావడంతో అక్కడే వదిలేసి వెళ్లిపోయినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

ఎంపీ శబరి, గౌరు పరామర్శ..

నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి సంజన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. శనివారం ఉదయం మార్చురీ వద్దకు చేరుకుని ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే టీడీపీ సీనియర్ నాయకుడు నందికొట్కూరు నియోజ కవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సంజన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. జరిగిన సంఘటనపై అడిగి తెలుసుకున్నారు.

ముందస్తు ప్రణాళికతోనే..

సంజన్న ప్రతి శుక్రవారం మెడిటేషన్ సెంటర్‌కు వస్తాడనీ అంజి వర్గీయులు ముందుగానే గుర్తించారు. అయితే.. రాత్రి వేళలో ఒంటరిగా దొరుకుతాడని, ఆ సమయంలో అంతమొందించాలని ప్లాన్ చేసుకున్నట్లు తెలుస్తోంది. మెడిటేషన్ సెంటరు దగ్గరలోనే అంజి ఇల్లు కూడా ఉంది. శుక్రవారం రాత్రి 12 నుంచి 15 మంది రెండు కార్లలో కారం పొడి, వేటకొడవళ్లు సిద్ధం చేసుకొని సంజన్నను అంతమొందించడానికి ప్రణాళిక వేసుకున్నట్లు సమాచారం. సంజన్న మెడిటేషన్ సెంటరు వద్దకు చేరుకోగానే అప్పటికే కాపు కాసిన వీరంతా సంజన్నపై దాడి చేశారు. ముందుగా కళ్లలో కారం కొట్టి ఆయన సెంటరులోకి వెళ్లక ముందే వేటకొడవళ్లతో అతికిరాతకంగా నరికారు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో నలుగురైదుగురు వృద్ధులు మాత్రమే ఉన్నారు. వారిని కూడా కత్తులు చూపించి బెదిరించినట్లుగా సమాచారం.

కేసు నమోదు...

సంజన్న కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వడ్డె రామాంజనేయులు అలియాస్ అంజి, ఆయన కొడుకులు వడ్డె కుమార్, శివ, రేవంత్‌లతోపాటు భార్య, అల్లుడు, మరికొంత మీద పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరితో పాటు 29వ కార్పొరేటర్ సుదర్శన్ రెడ్డి, శివారెడ్డి పేర్లను కూడా ఆ ఫిర్యాదులో ప్రస్తావించినట్లుగా సమాచారం. నిందితులపై బీఎన్ఎస్-189(4), 191(2), 118(1), 103(1), (2) /రెడ్‌విత్ 190 సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు కూడా నమోదు చేసినట్లుగా పోలీసులు తెలిపారు. మార్చురీ వద్ద డీఎస్పీ బాబుప్రసాద్, సీఐలు రామయ్య నాయుడు, తబ్రేజ్, ఎస్ఐలు గోపీనాథ్, చంద్రశేఖర్ రెడ్డి, మన్మథ విజయ్‌లు ఏఆర్ స్పెషల్ పార్టీ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రత్యేక బృందాలతో గాలింపు

సంజన్న హత్య కేసులో నిందితులుగా ఉన్న అంజి వర్గీయుల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని డీఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు. నలుగురు సీఐల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలిస్తున్నాయని, అలాగే పికెట్‌లో రెండు బృందాలతో బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు.

మత్స్యశాఖను బలోపేతం చేస్తాం

- కమిషనర్ రాంశంకర్ నాయక్



కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అపారమైన మత్స్య సంపద కలిగి ఉన్న మత్స్యశాఖను మరింత బలోపేతం చేస్తామని ఫిషరీష్ శాఖ కమిషనర్ రాంశంకర్ నాయక్ వెల్లడించారు. శనివారం ఆయన కర్నూలు నగరంలోని మత్స్య శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు, ఎన్జీవోలు, గ్రామ స్థాయి సిబ్బంది జిల్లా ప్రోగ్రాం మేనేజర్లతో సమావేశాన్ని నిర్వహించారు. శాఖాపరమైన లక్ష్యాలు, సాధించిన పురోగతి, ఆక్వాకల్చర్, కిసాన్ క్రెడిట్ కార్డ్స్, అలంకరణ చేపల పెంపకంతో పాటు ఎన్‌హెచ్‌డీపీ, ఈశ్రమ్ వెబ్ పోర్టల్‌లో మత్స్యకారుల నమోదు ప్రక్రియ, సంఘాల్లో నూతన సభ్యులను చేర్పించడం ఎఫ్ఎఫ్‌పీవో, ఇతర అంశాల గురించి చర్చించారు. వీటి లక్ష్యాల సాధనకు తగు సూచనలు చేశారు. సమావేశం అనంతరం రాయలసీమ మత్స్యశిక్షణ కేంద్రమైన కర్నూలులో శిక్షణా పొందుతున్న వారికి సూచనలు ఇచ్చారు. జిల్లా మత్స్యకార సభ్యులతో ప్రాథమిక మత్స్య సహకార సభ్యులతో, మహిళా మత్స్య సహకార సభ్యులతో మార్కెటింగ్, చేపల వినియోగం, సంగాల బలోపేతం గురించి చర్చించారు. అనంతరం నగరంలోని కింగ్ మార్కెట్ వద్ద ఉన్న చేపల మార్కెట్‌ను సందర్శించి స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌పై కార్మికులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా బంగారుపేట, సుంకేసుల, గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద ఉన్న చేప పిల్లల పెంపకం కేంద్రాలను పరిశీలించారు. మత్స్యశాఖ జిల్లా జేడీ శ్యామల, ఎఫ్‌డీవోలు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

శ్రీశైలంలో నకిలీ ఆన్‌లైన్ వెబ్‌సైట్!

శ్రీశైలం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో శనివారం నకిలీ ఆన్‌లైన్ వెబ్‌సైట్ కలకలం లేపింది. శ్రీశైలం దేవస్థానం మల్లికార్జున సదన్ పేరుతో ఉన్న నకిలీ వెబ్‌సైట్‌లో హైదరాబాదుకు, ముంబయికి చెందిన ఇద్దరు భక్తులు రూమ్స్ బుక్ చేసుకున్నారు. శనివారం ఉదయం వీరు శ్రీశైలం వచ్చి మల్లికార్జున సదన్‌లో రూముల కోసం వెళ్లగా అక్కడి నిర్వాహకులు స్కాన్ చేసి చూసి నకిలీవని నిర్ధారించారు. దీనితో వారు మోసపోయామని తెలుసుకున్నారు. ఇదివరకే ఇలాంటి నకిలీ వెబ్‌సైట్‌ల గురించి భక్తులకు అవగాహ కల్పించామని, ఇక ముందైనా ఇలాంటి నకిలీ వెబ్‌సైట్‌లను నమ్మవద్దని దేవస్థానం అధికారులు సూచిస్తున్నారు. శ్రీశైలం దేవస్థానం.ఒఆర్‌జీలో మాత్రమే అకామిడేషన్, సేవా టికెట్లు బుకింగ్ అవుతాయని చెబుతున్నారు.

శ్రీశైలంలో మద్యం పట్టివేత

శ్రీశైలం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం పరిధిలోని కొత్తపేటలో ఓ వ్యక్తి నుంచి మద్యం బాటిళ్లను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. శ్రీశైలం గ్రామానికి చెందిన మేకల శ్రీనాథ్ (31) అనే వ్యక్తి మద్యం అమ్ముతునట్లు సమాచారం అందడంతో స్బిబందితో కలిసి వారిని అదుపులోకి తీసుకున్నామని సీఐ ప్రసాద్‌రావు తెలిపారు. వారి వద్ద నుంచి 25 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు.

146 సూపర్ స్పెషలిస్టుల కోసం వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

కర్నూలు హాస్పిటల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో ఖాళీగా ఉన్న 146 సూపర్ స్పెషలిస్టు పోస్టుల భర్తీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ నరసింహం పోస్టులకు సంబంధించి ఈ నెల 24వ తేదీ వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వేతనాలు విద్యార్హత వివరాలను http:dme.ap.nic.in వెబ్‌సైట్‌లో ఉన్నాయని తెలిపారు. అర్హత గలిగిన వైద్యులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సిటీ సర్జరీ 15, కార్డియాలజీ 15, ఎండోక్రైనాలజీ 5, గ్యాస్ట్రో ఎంట్రాలజీ 9, మెడికల్ అంకాలజి 16, న్యూరోసర్జరీ 16, న్యూరాలజీ 13, ప్లాస్టిక్ సర్జరీ 4, పీడియాట్రిక్ సర్జరీ 5, సర్జికల్ అంకాలజి 14, యురాలజీ 12, వాస్క్యులర్ సర్జరీ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు న్యూసిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి మంత్రులు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ఎంపీలు, శాసన సభ్యులు హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ముందుగా జడ్పీ మినీ సమావేశ భవనంలో ఒకటో స్థాయి సంఘ సమావేశం ఉదయం 9:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

లీజుకు టూరిజమ్ ప్రాజెక్టు

కర్నూలు న్యూసిటీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలోని శ్రీలక్ష్మీ జగన్నాథగట్టు (లక్ష్మీపురం) వద్ద నిర్మించిన ఏపీ టూరిజమ్ ప్రాజెక్టును లీజుకు ఇవ్వనున్నట్లు జిల్లా పర్యాటక అధికారి విజయ శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టులో భాగంగా డార్మిటరీ, పార్క్, కెఫిటేరియా, టాయిలెట్ బ్లాక్, సెక్యూరిటీ గార్డ్, ప్రవేశ రుసుము వసూలు చేసుకునేందుకు 10 సంవత్సరాల కాల పరిమితి ఉందన్నారు. ఈ నెల 17 నుంచి 21 వరకు సాయంత్రం 4 గంటలలోపు టెండరు దరఖాస్తులను కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తు ఏపీ టూరిజమ్ కార్యాల యంలో సమర్పించాలన్నారు. వివరాలకు 6309942034, 8247704152కు సంప్రదించాలని కోరారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

ఆదోని, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ ప్రేమజంట శనివారం రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన మేరకు.. బళ్లారి జిల్లా గోనెహాల్ గ్రామానికి చెందిన మౌలా అనే యువకుడు బాదామికి చెందిన అనూష అనే యువతి ప్రేమించుకున్నారు. వీరి ప్రేమకు ఒప్పుకోని తల్లిదండ్రులు అనూషకు వేరే వ్యక్తితో వివాహం జరిపించారు. అయినా వీరు ఫోన్‌లో మాట్లాడేవారు. ప్రేమికుడిని మరిచిపోలేని అనూష ఈ నెల 11న బళ్లారికి వచ్చి ప్రేమికుడితో బైక్‌పై ఆదోనికి వచ్చి, పరిసరాల్లో తిరిగారు. అనూష వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు మౌలా ఇంటికి వెళ్లి ఘర్షణ పడ్డారు. విషయం తెలుసుకున్న ప్రేమజంట తాము కలిసి ఉండలేమని, చావులోనైనా కలిసి ఉండాలని పురుగు మందు డబ్బా తీసుకుని ఇద్దరూ తాగారు. అనంతరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తాము ప్రేమికులమని, పురుగుమందు తాగినట్లు తెలిపారు. పోలీసులు వీరిని హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కాగా వీరి పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం

'పది' పరీక్షలకు ఉచిత బస్సు ప్రయాణం

కర్నూలు రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు కర్నూలు జిల్లా ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం కె.సుధారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సు పాస్ లేనప్పటికీ ఒరిజనల్ హాల్‌టికెట్లు కండక్టర్‌కు చూపిస్తే ఉచిత ప్రయా ణానికి అనుమతి ఇస్తారన్నారు. పల్లెవెలుగు (ఆర్డీనరి), అల్ట్రా పల్లెవెలుగు (ఆర్డీనరీ) బస్సుల్లో తమ నివాస స్థానం నుంచి పరీక్ష కేంద్రం వరకు తీసుకెళ్తారన్నారు.

రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపండి

- జిల్లా ఇన్‌చార్జి అధికారి కాంతిలాల్‌దండే



మాట్లాడుతున్న అధికారి కాంతిలాల్ దండే

కర్నూలు కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ముఖ్యమైన రోడ్ల నిర్మాణాలు అవసరం ఉంటే ప్రతిపాదనలు పంపాలని రహదారులు, భవనాలు, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో రోడ్ల నిర్మాణాలు, ఇతర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, డీటీసీ శాంతకుమారి, నేషనల్ హైవే ఎస్‌డీసీ సునీత పాల్గొన్నారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం

జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిద్దామని జిల్లా ఇన్‌చార్జి ఆఫీసర్, రహదారులు, భవనాలు, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్‌దండే పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో చేపడుతున్న ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల అమలుపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ రంజిత్ బాషా, జేసీ నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకటనారాయణమ్మ, సీపీవో హిమప్రభాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

పాములపాడు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సరదాగా మిత్రులతో ఈతకు వెళ్లిన అమూల్యరాజ్ (14) తిరిగి రాని వెళ్లారు. వివరాలివీ.. మండలంలోని గుండాలనట్టు గ్రామానికి చెందిన ఆనందరావు కుమారుడు అమూల్యరాజు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శనివారం స్నేహితులతో కలసి సమీపంలోని తెలుగుగంగ కాల్వలో ఈతకు వెళ్లి మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాలుడి మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వివాహిత ఆత్మహత్య

తుగ్గలి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాంపురం లో రాజేశ్వరి (25) అనే వివాహిత శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లోనే ఉరి వేసుకోగా కుటుంబ సభ్యులు పత్తికొండ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందిందని తెలిపారు. మృతురాలిది తమిళనాడు రాష్ట్రానికి చెందిన క్రిష్ణగిరి జిల్లా ఉత్తరంగై గ్రామం. వెంకటేశ్వర్లు గత రెండేళ్ల క్రితం బతుకుదెరువు కోసం తమిళనాడుకు వెళ్లి పత్తి జిన్నులో పని చేస్తూ రాజేశ్వరితో ప్రేమలో పడ్డాడు. పెళ్లి చేసుకొని ఊరికి తీసుకువచ్చాడు. అయితే భార్యాభర్తలు తరుచూ గొడవ పడుతూ ఉండేవారని, అదే క్రమంలో శుక్రవారం కూడా గొడవ పడ్డారని సమాచారం. జొన్నగిరి పోలీసులు మృతురాలి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఓర్వకల్లు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన బోయ సాయి (25) అనే యువకుడు శనివారం రాత్రి విద్యుత్ స్తంభానికి తన ద్విచక్రవాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుడు ఉయ్యాలవాడ నుంచి ఉప్పలపాడుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. ప్రమాదవశాత్తు కరెంటు స్తంభానికి ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. యువకుడి తల్లిదండ్రులు శ్రీనివాసులు, పద్మావతి శోకసంద్రంలో మునిగిపోయారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫుల్ బాటిల్‌కు అలవాటు పడి డైలాగులు

- బైరెడ్డి సిద్దార్థరెడ్డిపై ఎంపీ శబరి విమర్శలు



మాట్లాడుతున్న ఎంపీ బైరెడ్డి శబరి

కర్నూలు క్రైం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఫుల్ బాటిల్‌కు అలవాటు పడి బైరెడ్డి సిద్దార్థరెడ్డి డైలాగులు చెబుతున్నాడని ఎంపీ శబరి అన్నారు. శనివారం మధ్యాహ్నం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 9 నెలలుగా కార్యకర్తలను గాలికి వదిలేసి.. నేడు కార్యకర్తల అరెస్టుల గురించి మాట్లాడే అర్హత రౌడీ నాయకులకు ఉందా అని ప్రశ్నించారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్టు చదవడం, సోషల్ మీడియాలో హల్‌చల్ చేసే వారికి రాజకీయాలెందుకని అన్నారు. జగన్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, నియోజకవర్గాల్లో తిరిగితే విషయం తెలుస్తుందని ఆమె విమర్శించారు. బైరెడ్డి అంటూ తమ కుటుంబం పేరు వాడుకోవడం తగదని అన్నారు. బైరెడ్డి వంశాన్ని కాపాడేది ఎంపీగా తనకే సాధ్యమని చెప్పారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్, డిప్యూటీ సీఎం జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్‌లపై సిద్దార్థరెడ్డి చేసిన వ్యాఖ్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

'భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలి'

శ్రీశైలం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా శ్రీశైలం వచ్చే కన్నడ భక్తుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని సీఐ ప్రసాదరావు సూచించారు. శనివారం పోలీసు స్టేషన్ ఆవరణలో సత్ర నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ క్షేత్ర పరిధిలో ఉన్న వివిధ అన్నసత్రాలలో భక్తులు రద్దీగా ఉండే రోజుల్లో భక్తుల నుంచి అధిక మొత్తంలో గదుల అద్దె వసూలు చేస్తున్నట్లు దేవస్థానం, పోలీసు అధికారుల దృష్టికి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

నందికొట్కూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 13వ వార్డులో గొల్ల సైదమ్మ అనే మహిళకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు అయిన రూ.25 వేల చెక్కును ఎమ్మెల్యే జయసూర్య ఆమె ఇంటికి వెళ్లి అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్లు జాకీర్ హుస్సేన్, చిన్నరాజు, అశోక్, నాయకులు లాయర్ జాకీర్, మల్లికార్జునరెడ్డి, కృష్ణారెడ్డి, కళాకర్, మోహన్, రమేష్, రవీంద్రారెడ్డి, శేఖర్, శాలిబాషా, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినియోగదారుల హక్కుల దినోత్సవం

నంద్యాల మున్సిపాలిటీ మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టెక్కె మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి, వినియోగదారుల క్లబ్ ఆధ్వర్యంలో శనివారం వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం షేక్ అబ్దుల్ ఖాదర్ అధ్యక్షత వహించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ ఇన్‌చార్జి అధికారి రాజు నాయక్, సహాయ అధికారి రవి బాబు, ఫుడ్ సేఫ్టీ అధికారి రాముడు, తూనికలు కొలతల శాఖ జిల్లా అధికారిణి అనిత, కోఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి, నంద్యాల జిల్లా వినియోగదారుల అధ్యక్షులు సయ్యద్ అమీర్ బాషా పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే సహించం: ఎమ్మెల్యే



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

మిడుతూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటే సహించేది లేదని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు . మండల కేంద్ర స్థానిక ఎంపీడీవో కార్యలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యేతో పాటు ఆర్డీవో నాగజ్యోతి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు జరగకుండా కొందరు వ్యక్తులు పిటిషన్లు వేస్తున్నారని, అలాంటి పిటిషన్లకు బయపడేది లేదని ఆయన మండిపడ్డారు. వారు పిటిషన్లు వేస్తే తాను కూడా పిటిషన్లు వేస్తానని చెప్పారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వివిధ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు వినతులు అందజేశారు. ఎంపీడీవో దశరథ రామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, ఈవోఆర్డీ సంజన్న, ఎస్ఐ ఓబులేసు, సర్పంచ్ జయలక్ష్మమ్మ, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

నంద్యాల కల్చరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కూచిపూడి నృత్య ప్రదర్శనలోని 108 కర్ణాలుపై శుక్రవారం నాట్యగురువు పల్లంశెట్టి సురేష్ శిక్షణ నిర్వహించారు. నంద్యాల ఎస్‌బీఐ కాలనీలో నంది ఫైన్ ఆర్ట్స్, ఆర్టిస్ట్ డెవలెప్‌మెంట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ సహకారంతో ఈనెల 7 నుంచి 14 వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. కూచిపూడి నాట్యంలో శిక్షణ కార్యక్రమంలో భాగంగా అహోబిలం లోని దేవాలయంలోని శిల్పాలని పోలుస్తూ నాట్యగురువులు సురేష్, మౌనిక 108 కర్ణాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

నంద్యాల రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): చాపిరేవుల జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, ఫైల్స్ పంపిణీ చేశారు. శనివారం గ్రామ సర్పంచ్ రాజు ఆధ్వర్యంలో పాఠశాల పూర్వ విద్యార్థి నాగసుబ్బరాయుడు తన గురువు గనిమియా జ్ఞాపకార్థం పంపిణీ చేశారు. పదో తరగతి తర్వాత విద్యార్థులు ఏం చదవాలి?, ఏం చేయాలి? అన్న అంశాలతో కూడిన బుక్‌లెట్లను అందజేశారు. పూర్వ విద్యార్థులు రాజశేఖర్, ప్రసాద్, జీవరత్నం, చిన్నసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీఎం ఎక్స్‌పో-25 ప్రారంభం

పాణ్యం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఆర్జీఎం ఎక్స్‌పో 25 ఉత్సవాలు శనివారం ఆర్జీఎం కళాశాల మైదానంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ప్రారంభించారు. వివిధ రకాల స్టాళ్లు ప్రజలను ఎంతో ఆకట్టుకున్నాయి ఈ స్టాల్స్‌లో రుచికరమైన వంటకాలు, ఆటల పోటీలు, పిల్లలకు ఇష్టమైన ఆటలు, యువతీ యువకులకు ఇష్టమైన ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మోటారు సైకిల్ పందేలు, కొలంబస్, జాయింట్ వీల్, నాయుడుగారి కుండ బిర్యాని, బ్రేక్‌డ్యాన్స్, బుక్‌స్టాల్స్, ఐస్‌క్రీం పార్లర్లు వంటివి విశేషంగా ఆకర్షించాయి. ఏటా నిర్వహించే ఈ ఉత్సవాలు కరోనాతో గత ఏడేళ్లుగా నిలిచినట్లు ఆర్జీఎం విద్యాసంస్థల అధినేత డాక్టర్ మిద్దె శాంతిరాముడు తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ఎండీ శివరాం, శాంతిరాం వైద్య శాల ఎండీ రఘురాం, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కొత్తపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరం- పాత మాడుగుల గ్రామాల మధ్యలో ఓ ఫోర్ వీలర్, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. శనివారం ఎర్రమటం గ్రామానికి చెందిన జొల్లు బాల లక్ష్మయ్య అనే వ్యక్తి తన భార్య సరస్వతితో ద్విచక్ర వాహనంపై సంగమేశ్వరం నుంచి స్వగ్రామమైన ఎర్రమఠానికి వస్తున్నారు. అదే క్రమంలో పాతమాడుగుల నుంచి సంగమేశ్వరం వెళ్తున్న ఫోర్ వీలర్ వాహనం, పాతమాడుగల-కపిలేశ్వరం మధ్యలోనే ధనుశాల లింగమయ్య స్వామి సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బాల లక్ష్మయ్య తలకు బలమైన గాయం కాగా, భార్య సరస్వతికి స్వల్పగాయాలయ్యాయి. సమీపంలో ఉన్న వారు 108కు సమాచారం ఇవ్వగా హుటాహుటిన వెళ్లి క్షతగాత్రులను ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. బాలలక్ష్మయ్య తలకు బలమైన గాయం కావడంతో అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. ఘటనా స్థలాన్ని కొత్తపల్లి పోలీసులు పరిశీలించారు. ఫోర్ వీలర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

'స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర'లో ప్రజాప్రతినిధులు, అధికారులు



నంద్యాలలో అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్వో

పాణ్యం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే గౌరు చరిత సూచించారు. 'స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా కౌలూరులో శనివారం ఎమ్మెల్యేతో పాటు నంద్యాల జేసీ విష్ణు చరణ్ హాజరయ్యారు. అనంతరం గ్రామంలో పారిశుద్య కార్మికులతో కలసి చెత్త ఊడ్చారు. ఘన వ్యర్థాల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా ప్రత్యేక అధికారి నివాస్, తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఈవోఆర్డీ చంద్రమౌళీశ్వరగౌడ్, సర్పంచ్ బాలయ్య, ఎంపీటీసీలు భాస్కరరెడ్డి, రంగరమేష్, టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, ముస్లీం మైనార్టీ నాయకులు ఖాదర్‌బాషా, టీడీపీ జిల్లా కార్యదర్శి రమణమూర్తి, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కౌలూరులో చెత్తను ఊడుస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

● పాణ్యంలోని ఇందిరానగర్‌లోని చెంచు కుటుంబాలకు ఉగాది కానుకగా ఎమ్మెల్యే గౌరు చరిత తొమ్మిది రకాల సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ చెంచు కుటుంబాలకు 167 గృహాలు మంజూరు చేశామని చెప్పారు. అన ంతరం టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

నంద్యాల నూనెపల్లె: నంద్యాల కలెక్టరేట్ ఆవరణలో శనివారం 'స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర' కార్యక్రమం జరిగింది. డీఆర్వో రామునాయక్, కలెక్టరేట్ సిబ్బంది ఆవరణంలోని పిచ్చిమొక్కలు, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరి శుభ్రం చేశారు. కార్యాలయ అధికారులు, సిబ్బందితో డీఆర్వో రామునాయక్ ప్రతిజ్ఞ చేయించారు.

నంద్యాల క్రైం: జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో 'స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర' చేపట్టినట్టు పోలీస్ అధికారులు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో కూడా సిబ్బంది, సాయుధ బలగాల అధికారులు, సిబ్బంది పరిసరాలను పరిశుభ్రం చేశారు. జిల్లా హెడ్‌క్వార్టర్‌లోని మోటార్ వెహికల్ విభాగం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలు, ఆయుధ విభాగం, కాన్ఫరెన్స్‌హాల్ పరిసరాలు, డీసీఆర్‌బీ, స్పెషల్‌బ్రాంచ్, పాస్‌పోర్ట్ కార్యాలయం, సైబర్ క్రైం కార్యాలయంతోపాటు అన్ని విభాగాల్లో అధికారులు, సిబ్బంది పరిసరాలను పరిశుభ్రం చేశారు.

● నంద్యాల ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో 'స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర' నిర్వహించారు. నంద్యాల ఏఈఎస్ వి.రాముడు, ఎస్‌హెచ్‌వో జి.కృష్ణమూర్తి, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ లక్ష్మణదాస్, ఎస్సైలు, స్టేషన్ సిబ్బంది, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: ప్రజలు ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. మిడుతూరులోని షాపు యజమానులకు ప్లాస్టిక్ విక్రయించరాదని వాటిని నిషేధించాలని నోటీసులు అందజేశారు. అనంతరం 'స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర' ప్రతిజ్ఞ చేశారు. బస్టాండు ఆవరణలో చెత్తను తొలగించారు. ఆర్డీవో నాగజ్యోతి, ఎంపీడీవో దశరథ రామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, ఈవోఆర్డీ సంజన్న, ఎస్ఐ ఓబులేసు, ఎంఈవోలు శ్రీనాథ్, ఫైజున్నిసా, పంచాయతీ కార్యదర్శి గోవిందు, సర్పంచ్ జయలక్ష్మమ్మ, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, సర్వోత్తమ రెడ్డి, రాజశేఖర రెడ్డి, వీరారెడ్డి, తిమ్మా రెడ్డి, సుధాకర్ రెడ్డి, మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

నందికొట్కూరు: పట్టణంలో 'స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర' నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బేబి, కౌన్సిలర్లు జాకీర్, చిన్నరాజు, టీడీపీ నాయకులు రవీంద్రారెడ్డి, రమేష్, తహసీల్దార్ శ్రీనివాసులు, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ రాంబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలో 'స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి ఎంవీఎస్ రాజ్, ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు. పాములపాడు పీహెచ్‌సీని మండల ప్రత్యేక అధికారి తనిఖీ చేశారు. గ్రామాలలో ని దుకాణ దారులు ప్లాస్టిక్ కవర్లను వాడరాదని పీఎస్ నాగశేషులు నోటీసులు అందించారు.

ఆత్మకూరు: 'స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని సంతమార్కెట్ ప్రాంగణంలో పారిశుధ్య చర్యలు చేపట్టి పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, టీడీపీ పట్టణాధ్యక్షులు వేణుగోపాల్, కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రషీద్ పాల్గొన్నారు.

● ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం 'స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి పారిశుధ్య చర్యలు చేపట్టారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు విద్యాసాగర్, కృష్ణ తదితరులు ఉన్నారు.

బండిఆత్మకూరు: బండిఆత్మకూరులో 'స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర' కార్యక్రమాన్ని సర్పంచ్ సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి అబ్దుల్ రెహామాన్, తహసీల్దార్ పద్మావతమ్మ, ఈవోపీఆర్డీ రామకృష్ణవేణి, కార్యదర్శులు అక్బర్, చక్రదర్, సచివాలయ సిబ్బంది, అంగన్ వాడీలు, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

వెలుగోడు: వెలుగోడులో 'స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవోఆర్డీ మురారి, ఏవో నరసింహారెడ్డి, టీడీపీ నాయకులు ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు. తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ జయపాల్ పాల్గొన్నారు.

మహానంది: మహానంది మండలంలో 'స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర' నిర్వహించారు. తిమ్మాపురంలో పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ సీనియర్ నాయకుడు కలర్స్ రవినాథరావు, టీజీపీ డిస్టి బ్యూటరీ కమిటీ చైర్మన్ క్రాంతికుమార్ పాల్గొన్నారు.

గడివేముల: మండలంలో 'స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర' కార్యక్రమా లను నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రత్యేక అధికారి జవహర్‌బాబు, ఎంపీడీవో వాసుదేవగుప్తా, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, ఈవోఆర్డీ మహిధర్‌రెడ్డి, సర్పంచ్ రమణమ్మ పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎద్దుల బలప్రదర్శన పోటీలు



ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న గౌరు జనార్దన్‌రెడ్డి

గడివేముల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒండుట్ల గ్రామ సమీపంలో వెలసిన రంగస్వామి ఆలయంలో తిరునాల సందర్భంగా శనివారం నిర్వహించిన ఎద్దుల పోటీలు హోరాహోరిగా సాగింది. టీడీపీ యువనాయకుడు గౌరు జనార్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డిలు వృషభాల బలప్రదర్శనను ప్రారంభించారు. వృషభాల యజమానులను సన్మానించారు. పి.తాండ్రాపాడుకు చెందిన వరలక్ష్మి ఎద్దులు, రామవరం గ్రామానికి చెందిన గణేష్‌రెడ్డి వృషభాలు, రామవరం గ్రామానికి చెందిన అక్షరారెడ్డి వృషభాలు, పెద్దకొట్టాలకు చెందిన నారాయణరెడ్డి ఎద్దులు, బిల్లలాపురం గ్రామానికి చెందిన జగదీష్ నాయుడు ఎద్దులు, లింగాలకు చెందిన పవన్‌కుమార్‌రెడ్డి వృషభాలు వరుసగా ఆరు స్థానాల్లో నిలిచాయి. టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, హర్షవర్ధన్, కృష్ణయాదవ్, పంట రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ జమాల్‌బాషా, నారాయణరెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, దిలీప్‌కుమార్‌రెడ్డి, గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొప్పాయి చెట్ల నరికివేత



బొప్పాయి చెట్లను నరికివేసిన దృశ్యం

మహానంది, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం వ్యవసాయ భూమిలో గ్రామానికి చెందిన రైతు ప్రసాద్ బొప్పాయి తోట సాగు చేస్తున్నారు. అయితే కొందరు బొప్పాయి చెట్లను చర్చిలో ఆధిపత్య పోరుతో నరికివేశారని శనివారం పోలీసులకు పిర్యాదు చేశారు.పోలీసులు విచారిస్తున్నారు.

ఘనంగా తిరునాళ్లు

గడివేముల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒండుట్ల గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మీరంగనాయక, రంగల్‌దర్వేసి ఖాద్రి తిరునాళ్లు మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన హిందూ, ముస్లింలు రంగస్వామి ఆలయంలో, రంగల్‌దర్వేసి ఖాద్రి దర్గాలో శనివారం పూజలు నిర్వహించారు. టీడీపీ యువ నాయకుడు గౌరు జనర్దాన్‌రెడ్డి రంగస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి దర్గా వద్ద ఫాతేహాలు సమర్పించారు. భక్తులకు గ్రీన్‌కో సోలార్ కంపెనీ, దాతల సహకారంతో అన్నదానం చేశారు. మాజీ జడ్పీటీసీ సీతారామిరెడ్డి, కృష్ణయాదవ్, హర్షవర్ధన్, గణేష్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, గిరిబాబు, మాజీ సర్పంచ్ జమాల్‌బాషా పాల్గొన్నారు.

'శ్రీ గురురాజా'లో ముగింపు వేడుకలు



చిన్నారులతో పాఠశాల యజమానులు, సిబ్బంది

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎన్జీవో కాలనీలోని శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రీ నర్సరీ ముగింపు వేడుకను ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరక్టర్ షేక్షావలి రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల గౌరవ సలహాదారులు సింధు, రేవతి నేతృత్వంలో రెండేళ్లు నిండిన చిన్నారులకు నిర్వహిస్తున్న ప్రీ నర్సరీ తరగతుల ముగింపు సందర్భంగా వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, వేషధారణలు, దేశనాయకుల ఫ్యాన్సీ డ్రస్, రైమ్స్, ఫ్యాషన్‌షోలతో విద్యార్థులు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

వేలం పాటలు మళ్లీ వాయిదా

మహానంది, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయానికి చెందిన భక్తుల వాహనాల టోల్‌గేట్ల వసూళ్ల హక్కు నిర్వహణ కోసం నిర్వహించిన వేలం పాటలు మూడోసారి వాయిదా పడింది. శనివారం ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి దేవస్థానంలో భక్తులకు ఏర్పాట్లు చెయ్యాల్సిన వివిధ ఏర్పాట్లకు కార్యాలయం సమీపంలోని పోచా విశ్రాంతి భవనంలో బహిరంగ వేలాలతో పాటు ఈ టెండర్ ద్వారా ప్రతి పాధికన నిర్వహించారు. అయితే గత ఏడాది నిర్వహించిన టోల్‌గేట్ టెండర్ ద్వారా దేవస్థానానికి రూ.1 కోటి 71 లక్షలు ఆదాయం రాగా, ఈ ఏడాది మార్చి 30 వతేదితో గతంలో ఉన్న టెండర్ దారుని ఏడాది గడువు ముగుస్తుంది. దీని కోసం ఇప్పటికి ఆలయ అధికారులు ఈనెలలోనే మూడు పర్యాయములు టెండర్ కమ్ బహిరంగ వేలంలో టోల్‌గేట్ నిర్వహణకు ఒకరే టెండర్‌దారుడు సీల్ టెండర్ దాఖలు చేశారని వాయిదా వేసారు. మరోసారి నిర్వహించిన బహిరంగ వేలంలో రూ. 1.4 కోట్లకు టెండర్ దారుడు బహిరంగ వేలంలో పాల్గొన్న ఒక కాంట్రాక్టర్ హెచ్చు పాట పాడిన అనుకున్నంత స్థాయిలో దేవస్థానానికి ఆదాయం రాలేదని వాయిదా వేసారు. కాగా మూడోసారి శనివారం నిర్వహించిన బహిరంగ వేలంలో రూ.1.30 కోట్లకు తక్కువ పాట పోవడంతో దేవస్థానానికి గతంలో నిర్వహించిన వేలం కంటే తక్కువ పోవడంతో తప్పని సరి పరిస్థితుల్లో ఆలయ అధికారులు వాయిదా వేశారు. గత ఏడాది నిర్వహించిన టోల్‌గేట్ల బహిరంగ నిర్వహణ కంటే ఈ ఏడాది నిర్వహించిన వేలాల్లో దేవస్థానికి రూ.లక్షల్లో తక్కువ కోడ్ రావడంతో వాయిదా వేశారు. దీనిపై మరోసారి ఈనెలలోనే బహిరంగ వేలం నిర్వహించి దేవస్థానానికి గతంలో నిర్వహించిన ఆదాయం రాకుంటే రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ అనుమతి తీసుకొని దేవస్థానమే భక్తుల వాహనాల వసూళ్ళ నిర్వహించే టోల్‌గేట్ల నిర్వహణను చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తు న్నట్లు సమాచారం. మిగిలిన వేలాలకు కూడా ఆశించనంత ఆదాయం బహిరంగ వేలంలో రాక పోవడంతో వాయిదా వేసినట్లు ఈవో చెప్పారు. ఆలయ ఏఈవో మధు, గ్రూపు దేవాలయాల ఈవో లక్ష్మినరసింహ, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం విజయవాడకు చెందిన పీఆర్ఎల్ ప్రసాద్ అనే భక్తుడు కుటుంబ సమేతంగా రూ.5,00,000 విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి జి. స్వాములుకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి,అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.



దాతకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న ఏఈవో

'పది'పరీక్ష కేంద్రం చిరునామాలో తప్పును సవరించాం: డీఈవో

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో 10వ తరగతి విద్యార్థులకు కేటాయించిన పరీక్షా కేంద్రం చిరునామాలో వచ్చిన తప్పును సవరించినట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఎస్‌బీఐ కాలనీ అని విద్యార్థుల హాల్ టికెట్‌లలో తప్పుగా వచ్చిందని, నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఉన్నతి పద్మావతినగర్ ఆర్చి సమీపంలోని టెక్కె అని, ఈ విషయాన్ని విద్యార్థులు గ్రహించాలని సూచించారు. ఇప్పటికే ఆ సెంటర్‌లో పరీక్షలు రాసే విద్యార్థులకు మార్పును తెలియజేసేలా హెచ్ఎంలను ఆదేశించినట్లు తెలిపారు. ఎంఈవో, ప్రధానోపాధ్యాయులతో తక్షణమే మార్పును ప్రతి ఒక్క విద్యార్థికి తెలియజేసేవిధంగా చర్యలు తీసుకున్నామన్నారు.

ఆదమరిస్తే అంతే..!

దెబ్బతిన్న కల్వర్టు, వాగు రహదారి



జ్ఞానాపురం రహదారిలో దెబ్బతిన్న కల్వర్టు

చాగలమర్రి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జ్ఞానాపురం, నారాయణపల్లె గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిలో కల్వర్టు, వాగు రహదారి దెబ్బతింది. కల్వర్టు మలుపు వద్ద రహదారి కోతకు గురై గండి పడింది. రాత్రి వేలలో వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదానికి గురి కావాల్సిందే. వాగు వంతెనపై స్లాబ్ దెబ్బతిని రహదారి బీటలు వారింది. ఆయా గ్రామాలకు వెళ్లే రహదారిపై కల్వర్టు, వాగు వంతెన దెబ్బతినడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నారాయణపల్లె రహదారిలో ప్రమాదకరంగా వంతెన

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



కృష్ణంపల్లెలో రాతిదూలం లాగుతున్న వృషభాలు

చాగలమర్రి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కృష్ణంపల్లె గ్రామంలో జమాల్‌వలి ఉరుసు సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలు హోరాహోరిగా సాగాయి. శనివారం బండలాగుడు పోటీలను మేనేజింగ్ డైరెక్టర్ పెద్దపుల్లారెడ్డి ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 8 జతల వృషాలు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ పోటీల్లో గెలుపొందిన వృషభాలకు మొదటి బహుమతి రూ.3,116, రెండో బహుమతి రూ.20,116, మూడో బహుమతి రూ.10,116, నాల్గో బహుమతి రూ.5,116 నగదును దాతలు అందజేశారు.

ఘనంగా జమాల్‌వలి ఉరుసు

చాగలమర్రి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కృష్ణంపల్లె గ్రామంలో వెలసిన జమాల్‌వలిస్వామి ఉరుసు మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన పిల్లలు, పెద్దలు, మహిళలు దర్గా వద్ద స్వామికి ప్రత్యేక ఫాతెహాలు, కానుకలు సమర్పించారు. స్వామి జెండాను పురవీధుల గుండా మేళతాళాలతో గ్రామోత్సవం చేశారు.

ఆత్మీయ వీడ్కోలు

చాగలమర్రి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని



చాగలమర్రి బాలుర పాఠశాలలో ఉపాధ్యాయులతో పది విద్యార్థులు

బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు ఈనెల 17 నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పదోతరగతి విద్యార్థులు వారికి శనివారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఇన్నాళ్లు ఒకే పాఠశాలలో కలిసి మెలసి చదువుకొని బయటకు వెళ్లి పోతుండటంతో కళ్లల్లో నుంచి ఉబికి వస్తున్న దుఃఖాన్ని దిగమింగుతూ నేస్తమా మళ్లీ కలుద్దామంటూ ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. అనంతరం పది విద్యార్థులు పాఠశాలలో ఉన్న సరస్వతిదేవి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని గురువులు ఆకాక్షించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యా కమిటీ అధ్యక్షుడు జల్సాగౌస్‌మొద్దిన్, హెచ్‌ఎం శాస్త్రీ, సీనియర్ ఉపాధ్యాయులు దీవిస్తూ విద్యార్థులకు ఆల్‌దబెస్ట్ చెప్పారు.

నేడు మంత్రి బీసీ కొలిమిగుండ్లకు రాక

కొలిమిగుండ్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మంత్రి బీసీ జనార్ధనరెడ్డి ఆదివారం కొలిమిగుండ్లలో పర్యటించనున్నట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి శనివారం వెల్లడించారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. ఆయా శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో సూచించారు.

21న మున్సిపల్ వేలం

డోన్ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ బహిరంగ వేలం 21న నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న కూరగాయల మార్కెట్, వారపు సంత మార్కెట్, బస్టాండు, జంతు వధశాల వంటి వాటికి వేలాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 20వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటలోపు వేలం పాటల్లో పాల్గొనే వారు డీడీ తీసి మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

ఆర్టీసీ బస్సు ఇంజన్‌లో పొగలు

చాగలమర్రి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని టోల్ ప్లాజా వద్దకు చేరుకున్న కడప డిపోకు చెందిన బస్సు కర్నూలు నుంచి కడపకు వెళ్తుండగా బస్సు ఇంజన్‌లో నుంచి పొగలు అధికంగా రావడంతో డ్రైవర్, ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. శనివారం టోల్ ప్లాజా వద్ద ఆర్టీసీ బస్సులో నుంచి పొగలు రావడంతో డ్రైవర్ అప్రమత్తమై బస్సు నిలిపి వేశాడు. సమీపంలోని టోల్‌ప్లాజా, పారామెడికల్ సిబ్బంది బలరామ్ బస్సు వద్దకు చేరుకొని ఇంజన్‌లో వస్తున్న పొగలను గమనించి మంటలు బయటకు రాకుండా అదుపు చేశారు. ఓవర్‌హిట్ వల్ల ఇలా పొగలు వచ్చాయని టోల్ సిబ్బంది తెలియజేశారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే

డోన్ రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు సమస్యలపై వినతులు అందజేశారు. యాపదిన్నె గ్రామానికి చెందిన మల్యాల రంగన్న అనే వ్యక్తి తీవ్ర కీళ్లమైన నొప్పులతో బాధపడుతున్నారనీ, తిరుపతి ఆసుపత్రికి కీళ్ల మార్పిడికి ప్రభుత్వం సాయం చేయాలని ఆ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ యాపదిన్నె రంగన్న ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి అందజేశారు. అలాగే నీటి సరఫరా, సిమెంటు రోడ్లు, కాలువలు, ఆరోగ్య సమస్యలపై ఎమ్మెల్యేకు వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో సీనీయర్ టీడీపీ నాయకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, మర్రి రమణ, ఓంప్రకాష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న యాపదిన్నె మాజీ సర్పంచ్ రంగన్న, తదితరులు

భూ ఆక్రమణలు సహించం

భూఆక్రమణలు సహించే ప్రసక్తే లేదని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ సమీపంలోని పేరెంటాలమ్మ గుడి ప్రాంతంలో కేంద్రీయా విద్యాలయానికి కేటాయించిన స్థలాలు ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారుల ద్వారా తొలగించడం జరిగిందన్నారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు వల్ల విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. డోన్ నియోజకవర్గం ప్రాంతంలో ప్రభుత్వ భూముల కబ్జాలపై దృష్టి సారించి వాటిపై చర్యలు తీసుకుంటామన్నారు. డోన్ నియోజకవర్గం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.

ఈద్గా అభివృద్ధికి కృషి

ఉయ్యాలవాడ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఈద్గా అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఉమ్మడి జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సయ్యారా సబిహా పర్వీన్ తెలిపారు. శనివారం ఉయ్యాలవాడ గ్రామంలో పర్యటించి కుందూ నది సమీపంలో ఉన్న ఈద్గాను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈద్గా చుట్టూ ఉన్న జంగిల్‌ను తొలగించి చుట్టూ ఇసుక వేయాలన్నారు. అలాగే రస్తా అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

- మండలంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు మండల ప్రత్యేక అధికారి సయ్యారా సబిహా పర్వీన్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని మసీదు వద్ద పారిశుధ్య పనులు చేపట్టారు.
- బుడ్డా వేంగళరెడ్డి దానగుణం మెచ్చి విక్టోరియా మహరాణి వేంగళరెడ్డికి బహుకరించిన బంగారు పతకం బేషుగ్గా ఉందని సయ్యారా సబిహా పర్వీన్ తెలిపారు. బుడ్డా వేంగళరెడ్డి వంశస్తుల గృహాన్ని ఆమె సందర్శించి బంగారు పథకాన్ని పరిశీలించారు. వారి వంశస్తులు బుడ్డా విశ్వనాథరెడ్డి వేంగళరెడ్డి జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమ మహేశ్వరరావు, తహసీల్దారు శ్రీనివాసులు, పీఆర్ ఏఈ వెంకటయ్య, ఉపాధి ఏపీవో రవిప్రకాష్, గ్రామ సర్పంచ్ ఓబులేసు, గ్రామ కార్యదర్శి జయరామిరెడ్డి, వీఆర్వోలు ఉన్నారు.

ఎగిసిపడిన మంటలు



డోన్ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కర్నూలు, నంద్యాల రైల్వే గేట్ల మధ్య శనివారం పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో ప్రజలు, ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. పట్టణంలోని నడిబొడ్డున మంటలు ఎగిసిపడటంతో మున్సిపల్ అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే వైన్‌షాపు, పూలమార్కెట్ ఉండటంతో అక్కడి వ్యర్థ పదార్థాలు వేయడంతో దుర్వాసన, చెత్తాచెదారం అధికంగా ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మున్సిపల్ కార్మికులు చెత్తాచెదారాన్ని తొలగించి ఉంటే మంటలు ఎగిసిపడేవి కావని ప్రజలు చెబుతున్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్యాపిలి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీలోని పదో తరగతి విద్యార్థినులకు ఏకలవ్య సేవా సమితి ఆధ్వర్యంలో పరిక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఆ సమితి అధ్యక్షురాలు మనోరమ వీటిని విద్యార్థినులకు ఉచితంగా పంపిణీ చేశారు. మనోరమ మాట్లాడుతూ పేద విద్యార్థులకు పరిక్ష సామగ్రిని అందజేయడంలో తృప్తి ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శేషాద్రి, శేఖర్, గోపాల్, శ్రీను, బాలక్రిష్ణ, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం

కోవెలకుంట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్లలోని జాతీయ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో నంద్యాల ఏపీడీ బాలాంజనేయులు అధ్యక్షతన సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం శనివారం నిర్వహించారు. 1.4.2023 నుంచి 31.3.2024 వరకు హౌసింగ్ శాఖ, ఎన్ఆర్ఈజీఎస్ శాఖ, పంచాయతీరాజ్‌శాఖలో కలిపి మొత్తం రూ.6.57 27,122 పనులు జరగాయి. ఈ పనుల్లో జరిగిన వాటిపై ఈ నెల 3 నుంచి 14 వరకు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో డీఆర్‌పీలు తనిఖీలు చేపట్టారు. 15న సాయంత్రం జరిగిన బహిరంగ సమావేశం లోపే వాటిని చదివి వినిపించారు. ఈ తనిఖీల్లో మస్టర్లలో త ప్పులు, కొట్టివేతలపై పలు అంశాలపై సుమారు రూ. 40,455ల అవినీతి జరిగినట్లు నిరూపించగా జిల్లా అధికారులు వాటిని రికవరీకి ఆదేశించారు. అలాగే మొక్కలు నాటే కార్యక్రమంలో చనిపోయిన వాటిపై రీప్లాంటేషన్ కోసం 34,244 మొక్కలు రీప్లాంటేషను చేసుకోవాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

18న సామాజిక తనిఖీ బహిరంగ సభ

కొలిమిగుండ్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కొలిమిగుండ్ల ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఈనెల 18న సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఏపీవో రాజబాబు శనివారం వెల్లడించారు. ఇప్పటికే మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి, ఉపాధి పనులను క్షేత్ర స్థాయిలో సామాజిక తనిఖీ బృందం పరిశీలన జరిపినట్లు తెలిపారు. 18న జిల్లా స్థాయి ఉపాధి అధికారులు, విజిలెన్స్ అధికారుల సమక్షంలో ఈ బహిరంగ సభ జరుగుతుందని అన్నారు.

గోవిందపల్లెలో శ్రీరామ జపయజ్ఞ సప్తాహం



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

శిరివెళ్ల, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని గోవిందపల్లె సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు అఖండ శ్రీరామ జయరామ నామ జపయజ్ఞ సప్తాహం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. విశ్వహిందూపరిషత్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు వైవీ రామయ్య మాట్లాడుతూ జపయజ్ఞ సప్తాహంలో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం పల్లకి సేవ నిర్వహిస్తామన్నారు. 22వ తేదీన భగవత్ గీతా ప్రచారకులు రాధా మనోహర్ దాసు, 23న పద్మశ్రీ సహస్రావధాని, సాగరఘోషా కవి డాక్టర్ గరికపాటి నరసింహారావు, 24న కాకనూరు శారదాపీఠం శివయోగేంద్ర సరస్వతి స్వాములవారు ప్రవచన సందేశాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, నాగమల్లేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నాం

డోన్ టౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు అన్ని సౌకర్యాలు, వసతులు ఏర్పాటు చేశామని డిప్యూటీ డీఈవో వెంకట్రామిరెడ్డి తెలిపారు. శనివారం డిప్యూటీ డీఈవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 17 నుంచి 31 వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులకు డెస్కులు, ఫ్యాన్లు, మంచినీటి వసతి, హాల్‌టికెట్ ఉన్న విద్యార్థికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కూడా ఏర్పాటు చేశామన్నారు. 8 పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లు 8 మంది, డిపార్టుమెంటు ఆఫీసర్లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే మూడు ఓపెన్ స్కూళ్ల విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయానికి అరగంట ముందే చేరుకోవాలని సూచించారు.

ఏప్రిల్ 14న లక్ష్మీనరసింహస్వామి ధ్వజ ప్రతిష్ఠ



పోస్టర్లను విడుదల చేస్తున్న కమిటీ నిర్వాహకులు

రుద్రవరం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం సమీపంలో కొలువుదీరిన దొర్ని చెంచులక్ష్మి నరసింహస్వామి దేవాలయ ధ్వజ శిఖర కలశ నాగ ప్రతిష్ఠ ఆహ్వానపత్రికలను శనివారం నిర్వాహకులు ఆవిష్కరించారు. ఏప్రిల్ 12న గోపూజ, 14న యంత్రాభిషేకం, ధ్వజ ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠలు, ప్రాణప్రతిష్ఠ, బింబ కళాన్యాసం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్: మంత్రి



పారిశుధ్య కార్మికులతో కలిసి చెత్తను తొలగిస్తున్న మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి



ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి



రుద్రవరంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీ చేస్తున్న ఫారెస్టు అధికారులు



చాగలమర్రిలో ర్యాలీ చేస్తున్న అధికారులు, పారిశుధ్య సిబ్బంది



సంజామలలో...

బనగానపల్లె, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సాధ్యమని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం స్వర్ణఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బనగానపల్లె పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు, డ్వాక్రా మహిళలు, మంత్రి బీసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పెట్రోల్‌బంకు కూడలి వరకు కొనసాగింది. పెట్రోల్‌బంకు కూడలిలో మానవహారం నిర్మించి స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రపై విద్యార్థులు నినాదాలు చేశారు. అనంతరం మంత్రి బీసీ అధికారులు, విద్యార్థులచే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రకు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. పెట్రోల్‌బంకు కూడలిలో మంత్రి స్వయంగా పారిశుధ్య కార్మికులతో కలసి చెత్తను స్వయంగా తొలగించి ఆదర్శంగా నిలిచారు. మంత్రి బీసీ మాట్లాడుతూ 2047 విజన్ లక్ష్యంగా ప్లాస్టిక్ రహిత సమాజాన్ని తీర్చిదిద్దేందకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది అన్నారు. బనగానపల్లె పట్టణంలో ప్లాస్టిక్ నివారణకు కొంత మంది వ్యాపారులు సహకరించడం లేదని వారిపై నోటీసులు ఇచ్చి వారిపై చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ, డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, తహసీల్దారు నారాయణరెడ్డి, ఎంపీడీవో రమణ, పంచాయితీరాజ్ డీఈ నాగశ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యు ఎస్ డీ ఈ వేణుగోపాల్, ఏఈ సాయికృష్ణతో, ఏపీవో రేష్మా, ఏపీఎం శ్రీనివాసులు, టంగుటూరు శ్రీనయ్య పాల్గొన్నారు.

డోన్ రూరల్: పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పాతబస్టాండులో గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే నాయకులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, ఆర్డీవో నరసింహులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్ పాల్గొన్నారు.

చాగలమర్రి: ప్లాస్టిక్‌రహిత సమాజం అందరి బాధ్యతని జిల్లా బీసీ సంక్షేమ అధికారి లక్ష్మీదేవి తెలిపారు. శనివారం చాగలమర్రి గ్రామంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, డీటీ విజయ్‌కుమార్, ఈవో తాహిర్‌హుసేన్ ఆధ్వర్యంలో స్వచ్ఛంధ్ర, స్వచ్ఛదివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీసెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గాంధీబజార్‌మీదుగా ర్యాలీ నిర్వహించారు. దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లు విక్రయించరాదంటూ నోటీసులు అందజేశారు. ముత్యాలపాడు గ్రామంలో పాలడైరీ చైర్మన్ రమణారెడ్డి ఆధ్వర్యంలో వైద్యశాఖ సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, కార్యదర్శి వెంకటేశ్వర్లు కలిసి స్వచ్ఛదివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

- పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఎంఈవో న్యామతుల్ల సూచించారు. శనివారం చాగలమర్రి సంత మార్కెట్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛంధ్ర-స్వచ్ఛదివాస్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేషాద్రి పాల్గొన్నారు.

రుద్రవరం: చెత్తను దులుపుదాం, పరిసరాలను శుభ్రంగా ఉంచుదామని రేంజర్ శ్రీపతినాయుడు, మండల ప్రత్యేక అధికారి నాగరాజు, ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం స్వర్ణంధ్ర, స్వచ్ఛంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రుద్రవరంలో ఫారెస్టు అధికారులు, పంచాయతీ సిబ్బంది ఆదర్శపాఠశాలలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, ఏపీవో ప్రతాప్, ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

- మనం ., మన పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని స్వర్ణంధ్ర స్వచ్ఛంధ్ర వీడియో ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం రుద్రవరం ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు తెలుగు ఉపాధ్యాయుడు రమణ వివరించారు. తల్లిదండ్రులకు విద్యార్థులు స్వర్ణంధ్ర స్వచ్ఛంధ్రపై అవగాహన కల్పించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

డోన్ రూరల్: మండలంలోని చిన్నమల్కాపురం గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డా.చెన్నకేశవులు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టారు. ఆసుపత్రి పరిసరాలని సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సరోజమ్మ, విజయలక్ష్మి, చెన్నయ్య, పారిశుధ్య కార్మికులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఆర్టీసీ బస్టాండ్, పంచాయతీ కార్యాలయం, విద్యుత్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోఆర్డీ బాలక్రిష్ణుడు, ఏఈలు ప్రభాకర్‌రెడ్డి, వినయ్, శివకుమార్ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర .. స్వర్ణాంధ్ర.. కార్యక్రమాన్ని కొలిమిగుండ్ల మండల అధికారులు తూతూ మత్రరంగా నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా కలెక్టర్, మంత్రులు, అధికారులు, ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున ర్యాలీల్లో పాల్గొనడంతో పాటు చీపురు పట్టి, చెత్త ఎత్తి, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తే .. మండల అధికారులు శనివారం ఎంపీడీవో ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో ఫొటోలకు ఫోజులిచ్చి మమ అనిపించారు.

సంజామల: పరిశుభ్రతతోనే పల్లెల ప్రగతి సాధ్యమని నొస్సం పశువైద్యాధికారి రగుబాలకృష్ణ అన్నారు. మూడవ శనివారం పురస్కరించుకొని నొస్సం గ్రామంలో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకుడు గాధంశెట్టి వెంకటేశ్వర్లు, బీజేపీ మండల అధ్యక్షుడు గుర్రాల చిన్నయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

డోన్ టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.హనీఫ్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సిబ్బంది చేత మొక్కలను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో డా.అనురాధ, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగరాణి, హెడ్ సిస్టర్లు హేమలత, సుధారాణి పాల్గొన్నారు.

బేతంచెర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి నెలా 3వ శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర స్వచ్ఛత దివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శనివారం బేతంచర్ల పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ ఆధ్వర్యంలో నగర పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి నంద్యాల రోడ్డు వద్ద మానవ హారంగా ఏర్పడి స్వచ్ఛత దివాస్‌పై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎంపీడీవో ఫజుల్ రెహిమాన్, తహసీల్దార్ ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

- మద్దిలేటి స్వామి క్షేత్రంలో ఆలయ ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.
- మండలంలోని ప్రాథమిక పాఠశాలను డోన్ డివిజన్ ఉప విద్యాధికారి వెంకట్రామిరెడ్డి సందర్శించి స్వచ్ఛత దివాస్ కార్యక్రమం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

శిరివెళ్ల : స్వచ్ఛత అందరి బాధ్యతని ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప అన్నారు. శిరివెళ్లలో పంచాయతీ కార్యదర్శి అశ్విన్ కుమార్ ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

దొర్నిపాడు: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఎంపీడీవో సావిత్రి అన్నారు. శనివారం స్వచ్ఛంధ్ర-స్వచ్ఛ దివాస్‌పై కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం, సచివాలయంలో శుభ్రత కార్యక్రమం చేపట్టారు.



డోన్ గాంధీ విగ్రహం ముందు ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



దొర్నిపాడు: డబ్ల్యూ.కొత్తపల్లెలో...



కొలిమిగుండ్లలో ఎంపీడీవో కార్యాలయం ముందు..



ప్యాపిలిలోని విద్యుత్ కార్యాలయం ఆవరణలో శుభ్రం చేస్తున్న అధికారులు



మద్దిలేటి స్వామి క్షేత్రంలో శుభ్రం చేస్తున్న సిబ్బంది



శిరివెళ్లలో ర్యాలీ చేస్తున్న అధికారులు